వాడ్రేవు చినవీరభద్రుడు

# కొండ మీద అతిథి

మరికొన్ని కవితలు



వాడ్రేవు చినవీరభద్రుడు

# కొండ మీద అతిథి

## మరికొన్ని కవితలు



వాడ్రేవు చినవీరభద్రుడు

# కొండ మీద అతిథి

కవిత్వం • శ్రీ ప్రచురణ



KOMDA MIDA ATITHI (A Guest on the Hill)
A collection of poems by
**VADREVU CHINAVEERABHADRUDU**

March, 2018

Coverpainting in oil pastels &
Inside line drawings:
Chinaveerabhadrudu.

Rs.50/-

Composed and designed by
**SAMANTHA GRAPHICS,** Hyderabad.

Published by
**DR.P.VIJAYASREE**,
89, Navodaya colony, Mehidipatnam, Hyderabad-28.

రాళ్లబండి కవితాప్రసాద్ కి

## వరుసగా

**నేనివ్వగలిగిన కానుక**

**కొండమీద అతిథి, మరికొన్ని కవితలు**


అదిలాబాద్, క్రిస్మస్, 2000 *11*

హైదరాబాద్, క్రిస్మస్, 2010*12*

మీరు ప్రేమలో పడ్డప్పుడు *13*

ఒక రంపానికి దేహాన్ని అర్పించడం సులభం *14*

పేమపరితప్తులైన సమయాల్లో *15*

ఒక సరస్తీరపక్షిలాగా *16*

ఇద్దరు స్త్రీపురుషులు ప్రేమకోసం *17*

మహావర్షాలు కురిసిపోయిన నీ మనోగగనమంతా *18*

నేలను ప్రేమించడంలో వేదన *19*

వసంతసేన *21*

చెరువైపోయిన గుండె *24*

నిన్నటిదాకా సన్నిహితంగా *26*

పూర్వకాలం మనుషులు *27*

వేసవి సెలవులు మొదలవుతూనే *28*

మిగిలినచరణంకోసం *29*

అప్పుడూ నువ్వు ఒంటరివే *30*

నీ పుట్టినరోజని గుర్తుకురాగానే *31*

ప్రతి వైశాఖరాత్రి *32*

ఈ మనుషులెందుకు *34*

బుట్టెడు బంగారుధూళి *36*

నా చామంతి తోట: అయిదు తంకాలు *39*

ఇప్పుడర్థమవుతోంది *41*

నాక్కూడా అదే అనిపించింది *43*

నిండుగాపూసిన మామిడిచెట్టుఎదట *44*

ఇద్దరు లేరు *46*
పువ్వుతో మటుకే *47*
మాఘమాసపు అడవి ఎదట *49*
ప్రేమ కొనసాగాలంటే *51*
సుగంధ స్మృతి *53*
ఒక తెల్లవారుజామున *55*
కన్నెగంటి రామారావు ఇన్నిస్ ఫ్రీ సరోవరం దగ్గర *57*
అన్నిటికన్నాముందు *59*
శరద్రాతుల మలుపు దగ్గర *61*
ఫిబ్రవరి రాగానే *63*
నామదేవుడూ, మొఘల్ సైనికుడూ *65*
మండు వేసవి వేళ *66*
పూలు పూలు పూలు పూసి *68*
జెండాకొండ : కొన్ని హైకూలు *69*
వివరించలేని వేదన *71*
అప్పుడు శ్రీకూర్మంలో *73*
నగరంలో ఫాల్గుణమాసం *76*
వసంతం ఒట్టి చిగురు కాదు *79*
గుచ్చుకుంటున్న దృశ్యం *80*
తురాయిచెట్టు *81*
ఇంకా ఎక్కడైనా ఒక బాలిక *82*
కబీరు ఒకరోజు కాశీలో *83*
నువ్వు నిజంగా విన్నది *84*
కొండమీద అతిథి *86*
ప్రతి ఏడూ చూస్తూనే ఉన్నాను *88*
నా పద్యాన్ని చేరుకున్నాను *90*

**వివరణలు**

**జీవితవివరాలు,రచనలు**

## నేనివ్వగలిగిన కానుక

**ఇం**తదాకా నేను వెలువరించిన కవితాసంపుటాల్లో ఇది ఆరవది. గత నాలుగు సంవత్సరాలుగా రాస్తూ వచ్చిన కవితలు ఇందులో ఉన్నాయి. ఈ ఆరు సంపుటాల్లోనూ చివరి నాలుగు సంపుటాలూ నా నగర జీవితంలోంచి వచ్చిన కవిత్వమే. ఈ కవితల్నిట్లా ఏరికూర్చుతుంటూ ఉంటే, పూర్వకాలపు చైనా సామెత ఒకటి గుర్తొస్తుంది. 'చిన్నపాటి పరివ్రాజకుడు కొండల్లో తిరుగుతాడు, సర్వ సంగపరిత్యాగి నగరంలో జీవిస్తాడు' అని. అవును. ఈ ఇరవయ్యేళ్ళుగా నేను ప్రాపంచికపరాజయాన్ని అభ్యసిస్తూ పూర్తిపరివ్రాజకుడుగా జీవించడమెట్లానో సాధనచేస్తూనే ఉన్నాననుకుంటున్నాను.

రాజమండ్రి రోజుల్లో నా మిత్రుడు, తర్వాతి రోజుల్లో ఒక పరివ్రాజకుడిగా ఇల్లు వదిలివెళ్ళిపోయిన కవులూరి గోపీచంద్ ఒక మాట అంటూండే వాడు: కవిత్వం భౌతిక విజయసాధనం కాదని. ఇది నేటి సాహిత్యయుగధర్మానికి పూర్తి విరుద్ధ వాక్యం. ఇంతదాకా సామాజిక నిశ్రేణిలో అణచివేతకి గురైనవారు కవిత్వం ద్వారానే ఈ ప్రపంచంలో తమ అస్తిత్వాన్నీ, తమ ఆరాటాల్నీ నిర్ధారించుకోవడానికి ఉద్వేగపడుతున్నకాలమిది. వారికి నా పూర్తి సమర్థన. కాని, నావరకూ, నేనిక్కడ, నా మిత్రుణ్ణి తలుచుకుంటూ, కవిత్వం ఎదట నన్ను నేనింకా పూర్తిగా త్యజించుకోలేకపోయానే అని చింతిస్తూన్నాను.

చిన్నప్పుడు పాఠశాలలో మొదటివరసలో కూచోడానికీ, అగ్రపంక్తిలో నిలబడటానికీ ఉత్సాహపడ్డాను. కాని కొన్నేళ్ళే. గోదావరి ఒడ్డున జీవించడం మొదలుపెట్టగానే కవిత్వం నన్ను సరిదిద్దటం మొదలుపెట్టింది. లోకాన్ని ఎత్తిచూపడంలో సంతోషంకన్నా, నన్ను నేను నిలదీసుకోడంలో ఎక్కువ తృప్తి కనిపించింది. మనుషుల్ని సాధికారం, సాయుధం చేయడంలో గొప్ప చారిత్రిక స్ఫూర్తి ఉండవచ్చుగాక, కాని నాలోని అధికారవాంఛను ఎండగట్టుకోడంలోనూ, నా ఎదట నన్ను నేను నిరాయుధుణ్ణి చేసుకోడంలోనూ నా జీవితానికెక్కువ సార్థక్యం వుందనిపించింది.

అలాగని నేను నా కర్తవ్యాలనుంచి, కార్యాచరణప్రణాళికలనుంచి తప్పించుకోలేదు, తప్పుకుపోలేదు. నేను మాత్రమే నిర్వహించగలననుకున్న ఏ

బాధ్యతనుంచీ ఏమరిఉండలేదు. పరిత్యాగమంటే ప్రపంచాన్ని వదిలెయ్యడం కాదు, ప్రపంచంలోనే ఉంటాం కానీ ప్రపంచానికి అంటిపెట్టుకుపోమనే పూర్వ మహాకవులు ఎప్పటికప్పుడు గుర్తుచేస్తున్నారు. చాలాసార్లు మనం గొప్ప బాధ్యత నిర్వహిస్తున్నామనుకుంటాం, కాని, నిజానికి అది మనలోని ఆధిపత్యభావజాలాన్ని సూక్ష్మరూపంలో తృప్తిపరుచుకుంటూ ఉండటమే. మన రాజకీయవిముక్తికోసం చేసే ప్రయత్నాల్లో మనకు లభించే ఊరట మన మానసిక విముక్తికోసం చెయ్యవలసిన ప్రయత్నాల్లో కనిపించదు. అదేమంత సౌకర్యవంతమైన పని కాదు. మనుషులు తోటి మనుషుల్ని వర్గ, వర్ణ, లింగ, ప్రాంత ప్రాతిపదికలమీద అణచి ఉంచడానికి ప్రయత్నించడం ఆధిపత్యం తాలూకు అత్యంత స్థూలరూపం, స్పష్టంగా పోల్చుకోదగ్గ వికారం. కానీ, ఎదటి మనిషి ఇలానే జీవించాలనీ, ఇలానే ఆలోచించాలనీ, ఇలానే కవిత్వం చెప్పాలనీ భావించడం ఆధిపత్య భావజాలం తాలూకు అత్యంత సూక్ష్మరూపం. నువ్వు మరొకరి ధర్మాన్ని నిర్ణయించడం కన్నా మించిన హింస మరొకటి లేదు. మనం బయటి ప్రపంచంలో చూస్తున్న అన్ని హింసలకీ మూలమిదే. దాన్ని పసిగట్టడం అంత తేలిక కాదు.

ఒక మనిషి పరివ్రాజకుడు కావడమంటే తనలోని అధికారిని నిశ్శేషంగా నిర్మూలించుకోగలగడం. ఒక్కమాటలో చెప్పాలంటే, మధ్యయుగాల భక్తికవులు చెప్పినట్టుగా నాలో కాముడు నశించి రాముడు మటుకే మిగలడం.

ఆ స్థితికి ఇంకా చేరుకోలేదని నాకు తెలుస్తూనే ఉంది. ఇన్నాళ్ళూగానూ కవిత్వం వైపే మొగ్గుతున్నా ప్రపంచం మీద ధ్యాస కూడా ఎంతో కొంత మిగిలే ఉందని అర్థమవుతున్నది. భర్తృహరి సంసారం నుంచి దూరంగా జరిగి కవిత్వం రాసినా, ప్రాపంచిక వాసనలు సూక్ష్మస్థాయిలో అతణ్ణి ఎలా అంటిపెట్టుకున్నాయో, ఒకప్పుడు కోశాంబి ఎంతో చక్కగా వివరించేడు. నీలోని ఆధిపత్యవాసనల్ని నువ్వెంత జాగరూకతతో పట్టుకోగలిగితే, నీ సమాజానికి నువ్వంత మేలు చేయగలుగుతావు. కనీసం, నువ్వున్నంతమేరకైనా ఈ సమాజాన్ని పరిశుభ్రపరచగలుగుతావు.

ఆ మెలకువతో ఇప్పటికి నేనివ్వగలిగిన కానుక ఇది.

హైదరాబాదు **వాడ్రేవు చినవీరభద్రుడు**

25 మార్చి 2018

## అదిలాబాద్, క్రిస్మస్, 2000

మళ్లీ అదేదారి, అదే అడివి,
ఒణికిస్తున్న శీతలపవనాలు.
భువి పైన వేల శుభాకాంక్షలు,
క్రిస్మస్ కాంతులు.

విజ్జీ, దగ్గరగా జరుగు, సర్దుకు కూచో,
ఈ ఎర్రబస్సులో ఈ గుడిహత్నూర్[1],
ఈ ధనోర, ఈ ఇంద్రవెల్లి.
కట్టుకోవడానికి గుడ్డకు కూడా నోచని
ఆ తల్లులు, ఆ పిల్లలు.

పయనించాలి విజ్జీ, మనం
ఆరునెలలకొకసారైనా
వెతుక్కుంటూ,ఈ అడవిబాటన,
మనని మనం గుర్తుపట్టడానికి.

విల్లమ్ములు, తుపాకులు, తుడుంమోత,
చెక్‌డామ్‌లు, పత్తిచేలు, కరువు ఋణాలు.
తోసుకుంటూ, దారి చేసుకుంటూ,
పిల్లలతో నడు ముందుకి .

విజ్జీ, ఇది మనవూరు, మన అడివి.

2000

## హైదరాబాద్, క్రిస్మస్, 2010

కొన్ని తారలు చలికి గడ్డకట్టి ఆకాశంలో,
కొన్ని ఇళ్ళ కప్పులకు వేలాడుతూ-
ఎక్కడా పాటలు వినరావడం లేదు,
సగం తునిగిపోతున్నవి జ్ఞాపకాలు.

విడిపోదామనడం రాజకీయం, సరే,
కలిసిఉండాలనడమూ రాజకీయమే.
కలిసిఉండాలనుకోవడం న్యాయం, కాని,
విడిపోవాలనుకోడమూ న్యాయమే.

ఉన్నాన్నేనిక్కడ ఈ స్థితిలో, విజ్జితో,
లోకం చూస్తూ పెరుగుతున్న పిల్లలతో-
ఏది నా దేశం, నా ఊరు, నా ప్రాంతం?
ఎవరు నా స్వజనం, బంధుగణం?

ఈ ఒంటరిరాత్రి మాకు తోడుగా,
నా పుస్తకాలబీరువాల్లో కథలు, కవితలు.
కాలసాగరం కెరటాలకు ఎదురీదిన
వాటి వెనక కొందరి కేరింతలు, కన్నీళ్ళు.

నేడు నావని చెప్పుకోగలిగినవివే.

2010

## మీరు ప్రేమలో పడ్డప్పుడు

మీరు ప్రేమలో పడ్డప్పుడు కొంతదూరం పోయాక
మీరిద్దరే ఉన్నట్టు గ్రహిస్తారు, చుట్టూ కెరటాలు,
చిన్న తెప్ప, తీరం సుదూరం. మీకొక ఏకాంతం
దొరికిందని పులకిస్తూనే పునరాలోచనలో పడతారు.

చలితహృదయాల చప్పుడు తప్ప మరేదీ వినబడని
నిశ్శబ్దంలో మీలో ఎవరో ఒకరిలా అంటారు: 'గుండె
చేతుల్లోపెట్టుకుని ఈదుతున్నట్టుంది. పగిలిపోకుండా
కాపాడుకోడానికి,ఇది ప్రేమ,గాజుసామానుకాదు.'

గ్రహించాలి మీరు, అప్పుడప్పుడు ప్రేమకూడా
జ్వరపడుతుంది, నిలబడలేకపోతుంది, నిస్సత్తువ
ఆవహిస్తుంది. అప్పుడు రాత్రంతా కళ్ళల్లో ఒత్తులు
వేసుకుని మీరిద్దరే కనిపెట్టుకు చూసుకోక తప్పదు

17-9-2013

## ఒక రంపానికి దేహాన్ని అర్పించడం సులభం

'..the spirit indeed is willing, but the flesh is weak'

*-The Gospel According to St.Matthew (26:41)*

ఒక రంపానికి దేహాన్ని అర్పించడం సులభం, మనసుని కాదు. చివరి నిమిషం దాకా నువ్వు ప్రార్థిస్తూనేవున్నావు వీలైతే ఈ పాత్రని నీ నుంచి తప్పిస్తే బాగుణ్ణని. అయినా నీ ఆత్మకప్పగించిన బాధ్యతకి నీ మనోదేహాల్నెట్లానో ఒప్పించావు.

ప్రభూ, ఇప్పుడర్థమవుతున్నది నాకు, గెస్తమని[2] తోటలో ఆ రాత్రి నువ్వనుభవించిన నరకయాతన. అంతకన్నా శిలువ నయం. ఎవరి కోసం నువ్వొక జీవితకాలాన్ని సమర్పించావో వాళ్ళొక్క రాత్రి కూడా నీ కోసం మేలుకోలేదు, ప్రార్థించలేదు.

అయినా, అర్థం చేసుకోలేకపోతున్నాను,నువ్వెట్లా ఒప్పించావో నీ మనోదేహాల్ని.ఎట్లా క్షమించావో మనుషుల్ని. బహుశా ఆత్మ దప్పిక పడగానే ముందు పిడచగట్టుకుపోయేది మనసు, ఆపైన ఛిద్రం కావడానికి దేహమెలానూ సిద్ధపడకతప్పదు.

17-10-2013

## ప్రేమపరితప్తులైన సమయాల్లో

ప్రేమపరితప్తులైన సమయాల్లో, కళ్ళల్లో కన్నీటిపొరలు
పేరుకుంటున్నప్పుడు, గొంతు గద్గదమయ్యేవేళల్లో
నిలవనివ్వని రక్తవేగోధృతి ముందు మీరొకరినొకరిని
పరికించుకుంటూ దేహాల్ని దాటి చూడాలనుకుంటారు.

ఒకరికొకరు దూరంగా ఉండవలసివచ్చినప్పుడు, తీవ్ర
వియోగదుఃఖం త్వరితంగా కాల్చేస్తున్నప్పుడు, ఇది
నాకు అవసరమా అనుకుంటారు. మెలిపడ్డ మనసుల్ని
విప్పి మామూలు మనుగడ సాగించాలనుకుంటారు.

కొన్ని క్షణాల్లో స్వర్గలోకపు అంచుల్ని తాకుతుంటారు
మరికొన్నివేళల్లో నేలకుజారిపోతారు, బహుశా ప్రేమ
సంతృప్తులైనప్పుడు మీరు కోరుకోవలసింది స్వర్గంకాదు,
భూమీ కాదు, ఆ రెంటినీ సమంగా నిభాయించడం.

21-10-2013

## ఒక సరస్తీరపక్షిలాగా

ఒక సరస్తీరపక్షిలాగా జీవించడం మొదలుపెట్టాలి
నీటితేమ నీ నేత్రాల్లో, రెక్కల్లో, దేహాంగాలన్నిట్లో
పాలుపోస్తున్న దృశ్యాన్నొక శాకుంతలంగా పునః
పఠిస్తూ నింగికీ, నేలకీ నడుమ నిచ్చెనవేయాలి.

ఇన్నాళ్ళూ నువ్వొక భ్రాంతిలో గడిపావు. శిఖర
సమానుడివి, అయితేనేం, మంచు కప్పేసింది.
జీవనాధారాన్ని పిట్టలు ముక్కుల్తో వెతుక్కున్నట్టు
కొన్ని వెలుగుతునకలకోసం నువ్వు గొంతుచాపాలి.

నీ చిన్నప్పటిగ్రామాల్లో పంటకోతలు, పనలుకట్టిన
కంకులు, చేటల్తో తూర్పారబట్టిన అపరంజిధూళి,
ఎక్కడెక్కడి పిట్టలూ, పాటగాళ్ళూ ఇప్పుడక్కడికి
చేరుకున్నట్టు నీ తలపులు కూడా పోయిరావాలి.

6-1-2014

## ఇద్దరు స్త్రీపురుషులు ప్రేమకోసం

ఇద్దరు స్త్రీపురుషులు ప్రేమకోసం చేతులు
చాపినప్పుడు నలుగురవుతారు, ఇద్దరు ఈ
లోకం మనుషులు, మరొక ఇద్దరు నెమిలి
పింఛాలు ధరించి హంసరెక్కల్తో ఎగిరివస్తారు.

నెమ్మదిగా ఇహలోకవ్యక్తిత్వాలు కనుమరుగై
లోకాతీత సంగీతం పుప్పొడివెదజల్లుతుంది
ఒకరినొకరు తదేకంగా చూసుకుంటూండగా
ప్రేమపరిణామక్రమంలో పువ్వు పండవుతుంది.

ఇంతలో ఏం జరుగుతుందో తెలీదుగానీ,
ఆ మంత్రమయలోకసంచారులదృశ్యమై
నరలోకమానవులిద్దరే మిగుల్తారు,బంగారు
వన్నె తిరిగిన ఫలంలో అప్పటికే ఒక క్రిమి.

8-1-2014

## మహావర్షాలు కురిసిపోయిన నీ మనోగగనమంతా

మహావర్షాలు కురిసిపోయిన నీ మనోగగనమంతా
దట్టమైన పొగమంచు. కోతలు పూర్తయిన పొలాల్లో
సందడి ముగిసిన నిశ్శబ్దం. చెట్లు ఆకులు రాల్చినట్టు
నిన్ను నువ్వు రిక్తం చేసుకోవలసిన తరుణమిది.

పడవలోనీళ్ళు, ఇంట్లో వస్తువులూ చేరుతుంటే
రెండుచేతుల్తోనూ ఎత్తిపోసెయ్యమన్నాడు కబీరు[3].
అదేపనిగా తలపులు చేరుతుంటే మనసుకూడా
మునిగిపోగలదని గ్రహించావిప్పటికి, సంతోషం.

ఎక్కడో ఒక పక్షి కిలకిలతో ఆకాశం తలుపు
తెరుస్తుంది. మంచు వెలుతురుగా మారే వేళల
కోసం ఓపికపట్టు, నువ్వేమీ చెయ్యకుండానే
ధనుర్మాసప్రభాతం తిరుప్పావై[4] వినిపిస్తుంది.

9-1-2014

## నేలను ప్రేమించడంలో వేదన

'ఈ ప్రపంచంలో తురాయిచెట్లన్నటికీ
నువ్వే హక్కుదారువి తెలుసా' అందామె.

ఒక్క తురాయిచెట్లకేనా?
తల్లికన్నాముందే లేచి ఊరికే గుక్కపట్టే పిల్లలాంటి
గ్రీష్మకాలపు కోయిలకు కానా!

అన్నదమ్ముల మధ్య పంపకాలు సాగుతున్న సమయం.
వస్తువులు, భవనాలు, కాగితాలు, మనుషులు
ప్రతి ఒక్కటీ పంచేసుకుంటున్న తరుణం.

ఇళ్ళు ఖాళీచేసేటప్పుడు పారేసిన
రంగుకాగితాలో, రిబ్బన్లో ఏరుకునే పిల్లవాడిలా
ఎవరికీ అక్కర్లేని
కొన్ని రంగుల్లో, కొన్ని రాగాల్లో, కొంతనిశ్శబ్దంలో
కూరుకుపోయాను.

నేను పుట్టిన ఊరుని నేనెంతో ఇష్టపడ్డాను.
మా అమ్మని చూడకుండా ఉండలేనట్టే
మా ఊరిని కూడా చూడకుండా ఉండలేకపోయాను.

పదేళ్ళు నిండకుండానే నా ఊరువదిలిపెట్టినప్పుడు
నేలని ప్రేమించడంలో వేదన ఏమిటో తెలుసుకున్నాను

గుమ్మలక్ష్మిపురం[5] అడవుల్లో ఒక కోదుపల్లె
ఒక అదిలాబాదు గోండుగూడ
ఒక పాలమూరు చెంచుగూడెం

నేను జీవించవలసివచ్చిన ప్రతి తావులోనూ
నా కన్న ఊరినే కనుగొంటూ వచ్చాను.

యాభయ్యేళ్ళ వయసులో మరొకసారి
నేలను ప్రేమించడంలో వేదన ఏమిటో
తెలుసుకోవలసివచ్చింది.

ఇప్పుడు నాకంటూ ఒక ఊరులేదు
నాదని చెప్పుకునే తావులేదు.

అందుకనే సొంతం చేసుకుంటున్నాను,
ఎవరికీ అక్కర్లేని
ఎవరూ పంచుకోని
పక్షికూతల్ని, పూలరెక్కల్ని
మబ్బుతునకల్ని.

31-3-2014

## వసంతసేన

From loneliness we extract life's faint sweetness
And distill it into poetry..

*-Kaneko Mitsuharu (Song of Loneliness)*

నీ జీవితం మూడవజాము గడుస్తుండగా
నువ్వు చూస్తూ ఉండగానే ఒక స్త్రీ
బయటకి వెళ్ళిపోయింది.

ప్రేమించడం, మరీ తీవ్రంగా ప్రేమించడం తప్ప
నువ్వు మరే నేరమూ చెయ్యలేదు.

నీ హృదయాన్ని మృదువుగా తన హృదయంనుంచి తప్పించి
వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోతున్నప్పుడు
నువ్వు మౌనంగా ఉండిపోయావు, అది
వేడుకుంటే ఆగేది కాదని నీకు ముందే తెలుసు.

అప్పుడు, ఆ క్షణాల నిశ్శబ్దం కూడా
ప్రేమవరదానమేనని తెలుసుకో.

మళ్ళా ఒక ఏప్రిల్ వచ్చినప్పుడల్లా
మృచ్ఛకటికనాటకం మరొకసారి చదువుకున్నట్టే అనిపిస్తుంది.

నువ్వు చారుదత్తుడివే,
నీ హృదయమంతా కుమ్మరించావు.
కాని నువ్వుకూడా ఎంతోకొంత పొందావన్నదే నిన్ను
నిలవనివ్వని వేదన

ఎక్కణ్ణుంచి వస్తుందో కోకిల
సరసులాంటి నీ తెల్లవారుజాములో
అల్లరిపిల్లవాడిలాగా ఒక జ్ఞాపకం విసుర్తుంది,
ఇక వలయాలు, వలయాలుగా మనసుచిట్లిపోతుంది.

దేన్నైనా భరించవచ్చుగాని
ప్రేమ ముగిసిపోయిందనే తలపు భరించడం కష్టం.
అది జీవన్మృతి.

అప్పుడప్పుడు కోకిల
ఎక్కణ్ణుంచో కరిచితెచ్చి ఒక గింజ రాలుస్తుంది.
ఇక మిలమిల్లాడే చైత్రమాసపు ఆకుపచ్చని వెలుతురు,
బాటమీద పాటలాగా రాలిపడే పసుపుపూలవాన.

నీ ప్రేమపూర్వశైశవం గుర్తు తెచ్చుకో,
అప్పుడెవరున్నారంటుంది.

అదేమి చిత్రమో కాని, నదీస్నానంలో
మునకలేసినట్టు ప్రేమలో మునిగినప్పుడు
వెచ్చగానే ఉంటుంది,

ప్రేమనుంచి విడివడ్డప్పుడే, గమ్మత్తైన అనుభవం.

తిమ్మిరినుంచి బయటపడ్డప్పటిలాగా,
జీవితం మరింత ప్రేమించదగ్గదిగా గోచరిస్తుంది.
చుట్టూ ఉన్న చెట్లని, మనుషుల్ని, వస్తువుల్నీ
పేరుపేరునా పోల్చుకోవడం మొదలుపెడతావు.

రాత్రి నిద్రలో మొదటిజాము గడిచాక
ఒక స్త్రీ వెళ్ళిపోతూ కనిపించింది నీకు,

ఎందుకు వెళ్ళిపోతున్నావని అడగాలనుకున్నావు,
ప్రాధేయపడాలనుకున్నావు,
మాట పెగల్లేదు.

రెండవజాము, మూడవజాము
మరొక ఇద్దరు స్త్రీలట్లానే వెళ్ళిపోయారు.

నాల్గవజామున సరసులాంటి తెల్లవారుజామున
ఒక తెలినీలి ఊహ కనిపించగానే
దిగ్గున లేచి కూచున్నావు.
చేయిపట్టుకున్నావు, పాదాలకు చుట్టుకుపోయావు,
ఎవరు వెళ్ళిపోయినా పర్వాలేదు
నిన్ను మాత్రం వదులుకోలేనన్నావు.

ఒంటరివయ్యావనుకున్నప్పుడు కూడా
ఒక వసంతసేన నిన్నంటిపెట్టుకునే ఉంది.
రాత్రంతా కురిసిన పూలవాన, తీపిగాలి
నిన్ను దగ్గరగా లాక్కుంటున్న కోకిల.

10-4-2014

## చెరువైపోయిన గుండె

చిన్నప్పుడే తొమ్మిదేళ్ళకో, పదేళ్ళకో పెళ్ళయ్యి
పుట్టింటినుంచి దూరంగా వచ్చేసిన జీవితం నీది.

చూడాలనిపించినప్పుడల్లా చూట్టానికి
పోవాలనిపించినప్పుడల్లా పోడానికి
వీల్లేనంత దూరం.

పెళ్ళిపల్లకీ ఎక్కినప్పుడు
ఒట్టి ఆట అనుకున్నావు.
తోరణాలు, సన్నాయి
మరొక పండగేమో అనుకున్నావు.
రెణ్ణాళ్ళు గడిస్తే మీ ఊరువెళ్ళిపోతావనీ
బొమ్మలపెళ్ళి ఆడుకుంటావనే అనుకున్నావు.

చూస్తూండగానే
గడిచిపోయాయి ఏళ్ళు, దశాబ్దాలు.

నీ తెలివిని ఈ లోకానికొక పాన్పు చేసి
ప్రణాళికలు కంటున్నావు.
నీవికాని భాష, నేల, గాలి
నీవనుకుంటూనే బతుకు వెళ్ళదీస్తున్నావు.

గుర్తుందా, నీ చిన్నప్పుడు కాకరపాడు[6] సంతలో
ఒక కోదుయువతి కళ్ళనీళ్ళుపెట్టుకున్నప్పుడు
మీ నాన్న చెప్పాడు నీతో,
ఆమె పుట్టింటివాళ్ళు కనబడివుంటారని.

దిసమొల పిల్లవాడు వీథిలో
బూరావూదుకుంటునట్టు కోకిలపిలుపు.
ఆకాశాన్ని వడగట్టి చైత్రమాసపువాన
రాత్రంతా పిండిన పూలతావి.

నీ స్వజనం, నీ స్వగ్రామం, నీ స్వదేశం
నీ ఇంటి తలుపు తడుతున్నారు.

నీ గుండె చెరువైపోయింది.

12-4-2014

## నిన్నటిదాకా సన్నిహితంగా

Whatever Tulsi feels, you are that..

*-Tulasidas*

నిన్నటిదాకా సన్నిహితంగా కనిపించిన వదనంనుంచి
నువ్వు దూరంగా జరిగిపోతున్న వైనం. వేసవికాలపు
ఏటిపాయలా క్రమక్రమంగా సన్నగిల్లుతున్న నీలిచార,
ఇప్పుడు నిన్ను రేలపూలగుత్తుల్లోమాత్రమే చూడగలను.

తెలిసినచోటునుంచి నువ్వు పక్కకుతప్పుకున్నప్పుడంతా
ప్రభో, ఆ పార్శ్వమంతా ముందు తిమ్మిరెక్కిపోతుంది.
నీ వెలుతురు ముందుకు జరిగిపోయిఉండవచ్చు, ఐనా
మనం చేరువైన ప్రతి తావులోనూ నీ నీడ వదిలిపెట్టావు.

నువ్వు బయట మటుకే లేవని మరోసారి గ్రహించాను
కాని నువ్వు బయట కూడా ఉన్నావు, ఎక్కడున్నావో
చూపించు అని నేనొక పురాణ పాత్రలాగా ప్రశ్నించాననుకో
కిందటేడాది కాలెండరులోంచి కూడా బయటికొస్తావు.

1-5-2014

## పూర్వకాలం మనుషులు

పూర్వకాలం మనుషులు మట్టిని బంగారంగా
మార్చే విద్యకోసం వెతుకులాడేరు, ఊహించు:
నువ్విట్లా తాకేవో లేదో క్షుద్రమైంది ప్రతిఒక్కటీ
సువర్ణంగా మారిపోతుందనే సుందరచింతన.

ఎట్లాంటి కాలానికి వచ్చిపడ్డాం! ఇప్పుడిక్కడ
పుత్తడి ఇత్తడిగా మారుతున్న రసాయనం.
నువ్వెంత ప్రేమగా చేరదీసుకున్నా నీ స్పర్శ
తగిలితే చాలు మనుషులు శిలలవుతున్నారు.

తుప్పుపడుతున్న గుండెని మళ్ళా అపరంజిగా
అతుకుపెట్టే ఆ పరుసవేది ఎక్కడనుకున్నానా!
వైశాఖమాసపు ప్రతి ఒక్క తురాయిచెట్టూ ప్రతి
ఒక్క ధూళికణాన్నీ కాంతికణికగా కరిగిస్తున్నది!

2-5-2014

## వేసవి సెలవులు మొదలవుతూనే

వేసవి సెలవులు మొదలవుతూనే పిల్లలింటికొచ్చినట్టు,
రోజూ ఇంట్లో ఒక పుట్టినరోజు పండగ జరుపుతున్నట్టు,
నిత్యకల్యాణ ప్రాంగణానికి కట్టుకున్న పచ్చతోరణంలాగా,
మా ఆఫీసు ఎదురుగుండా విరబూసింది తురాయిచెట్టు.

కొన్నేళ్ళుగా ప్రతి వేసవిలోనూ తిరణాల జరుపుతున్నట్టు,
నేతపనివాళ్ళు మగ్గంమీద కొత్తవస్త్రం ఎక్కించినట్టు,
కన్యలు కలల దారాలతో కుడుతున్న అల్లికలాగా,
కిటికీపక్క గాజులదుకాణం తెరిచింది తురాయిచెట్టు.

ఏ సిద్ధపురుషుడి దర్గామీదనో ఎర్రచాందినీ కప్పినట్టు,
వేలవత్తుల్తో రోజంతా ఆకాశానికి హారతి పడుతున్నట్టు,
జల్లెడలోంచి కాంతిజల్లించేక మిగిలిపోయిన మణుల్లాగా,
గలగల్లాడుతున్న పూలతో గళమెత్తింది తురాయిచెట్టు.

5-5-2014

## మిగిలినచరణంకోసం

Let the earth be pure in body and mind
By the bath of fire..

Tagore *(Come Baisakh)*

భూమి కోసం సూర్యుడు త్రేతాగ్ని రగిలిస్తున్న
వైశాఖంలో పుట్టావు నువ్వు. నేనేమో నీకన్నా
నెలరోజులు ముందుపుట్టాను[7]. జ్వాలభాసమాన
వసంతసేన ఇంటిముందు ఇద్దరం పిచ్చివాళ్ళమే.

వైశాఖం రాగానే పాతపాటలు మరిచిపోవాలని
పూర్వదుఃఖాలు తొలిగిపోవాలని కోరుకున్నావు.
ఐనా కవీ, ప్రతి వేసవిలోనూ వైశాఖచంద్రుడు
పాతహిందీపాటలే ఎందుకు పాడుతుంటాడు?

రెక్కలగుర్రాలు, రేలచెట్లు, కృష్ణమేఘాలు,
కొంగలబారులు. ఒకప్పుడు అమ్మకడుపులో
సగమే విన్నపాట. మిగిలినచరణంకోసం ప్రతి
వైశాఖంలోనూ మనమిట్లా వెతుక్కుంటున్నాం.

7-5-2014

## అప్పుడూ నువ్వు ఒంటరివే

She whom people call spring
I call loneliness

*Anna Akhmatova (Poem Without A Hero)*

వేసవిరాత్రి ఎప్పటిదో ఒక జ్ఞాపకం,
కిటికీలోంచి చల్లని చేతులు చాపింది.
ఈ మంత్రమయవేళ ఒక ఫోన్ కాల్
కూడా నిన్ను మాయం చెయ్యగలదు.

గుర్తుందా, అప్పుడు మీ చిన్నప్పటి
ఇంటి వీథరుగుమీద వసంతరాత్రుల
రాధామనోహరాలతీపిగాలి, బిడ్డా నీకు
తెలీదుగానీ అప్పుడూ నువ్వు ఒంటరివే.

నీ ఒంటరిప్రపంచంలో తురాయిచెట్లు
విరబూసే రోజులురాగానే ఎవరో నీ
ఇంటితలుపు తడుతుంటారు, జాగ్రత్త,
నీ ఏకాంతమాధుర్యం కలతబారేను.

10-5-2014

## నీ పుట్టినరోజని గుర్తుకురాగానే

When I bring to you colored toys, my child, I understand why there is such a play of colors...

*Tagore ( Gitanjali: 62)*

తెల్లవారుతూనే నీ పుట్టినరోజని గుర్తుకురాగానే
నీకోసం నేనే కానుక తేగలగనని ఆలోచించాను
మా అక్కకోసం,మా చెల్లెళ్ళకోసం మా నాన్న
ఏ కానుకలు తెచ్చేవాడని ఆలోచనలో పడ్డాను.

సంతనుంచి తెచ్చిన పంచదారచిలక, గిరిజన
కార్పొరేషన్ డిపోలోంచి కొత్త తానుతో కుట్టించిన
పూలగౌను. అన్నిటికన్నా ముఖ్యం, ఆడపిల్లలు
చదువుకోవాలని బతుకంతా తపన పడ్డాడు.

నాకా బాధ లేదు, నువ్వెలానూ చదువుకుంటావు,
బాగా చదివి చదివి అలిసిపోయినప్పుడు నువ్వు
సేదతీరడానికి నా చిన్నప్పటి వేసవిరోజులతీరికనంతా
పోగుచేసి పందిరేస్తాను, తాటిముంజల బండి పెడతాను.

12-5-2014

## ప్రతి వైశాఖరాత్రి

ప్రతి వైశాఖరాత్రి చంద్రుడు ఆకాశం దిగిపోయే ఒంటరివేళ
నన్నడుగుతూనే ఉంటాడు: 'ఇది రాయగలవా?'

రాయగలవా? దీన్ని, ఈ క్షణాన్ని?

లెనిన్ గ్రాడ్ చెరసాలలముందు నెలలతరబడి
వేచిఉన్న ఒక తల్లి అన్నాఅక్మతోవాని అడిగినట్టు[9] .

పాతకాలపు ఫొటోల్లో కనబడేలాంటి పేలపసుపురంగు,
ఏ లోయల్లోంచో పూలతావి,
ఎక్కడో ఒక కవి ఇంకా మనిషిగా మారుతున్న గుసగుస.

తెల్లకాగితంలాగా ఆకాశం నీ ముందు నిలబడగానే
ఒక కుంచెలాగా కోకిల కూత నీ చేతుల్లో-

రాయడం కాదు, చిత్రించాలి:

కొన్ని కారుణ్యవదనాలు,
కొన్ని కలతపరిచే మధురిమలు.

నీ చిన్నప్పుడే నిన్నెవరో ఈ వెన్నెల్లోకి తోసేసారు,
ఇక్కడిదాకా ఈదుకొచ్చావు.

అప్పుడు రాత్రవుతూనే నీ గ్రామం, అడవి, కుటుంబం
అన్నీ మౌనం వహించేవి,
ఆకాశమొక్కటే మాట్లాడేది.

అప్పుడు విన్నదేదో ఇప్పుడు రాయగలవా అనడుగుతుంటే
అతడు నీకు మళ్ళా దొరుకుతాడా అన్నట్టు వినిపిస్తుంది.

తప్పిపోయిన పిల్లవాడి ఫొటోపదేపదే చూసుకున్నట్టు
పదేపదే చంద్రుణ్ణే చూసుకుంటాను.

ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా వెతకవలసిన
తావులన్నీ వెతికాక ఒకటి తెలుసుకున్నాను,
అతడెక్కడున్నాడో కానీ,
ఇక్కడ ఈ నగరంలో మటుకు కనబడడు.

18-5-2014

## ఈ మనుషులెందుకు

ఈ మనుషులెందుకు నా జీవితంలోకి అడుగుపెడుతున్నారని
చాలాకాలమే చింతించాను, విస్మయం చెందాను.
ఒక్కొక్కప్పుడు వాళ్ళని మెడపట్టుకు
బయటకి తోసేద్దామని కూడా అనుకున్నాను.

అయినా మనుషులు రావడం ఆగట్లేదు.

కొందరు కిటికీలోంచి
కొందరు మొబైల్ మెసేజిల్లోంచి
కొందరు ఎవరో ఎక్కడో మాట్లాడుకునే
తీరికసమయపు ముచ్చట్లలోంచి.

మనుషులు వీథితలుపు తెరుచుకు వస్తారేమోనని
ఒక హైకూ కవి[10] లాగా తలుపుకి గొళ్ళెం పెట్టేస్తే
వాళ్ళొక తురాయిచెట్టు విస్ఫోటనంలోంచి
ఒక తెమ్మెరమీంచి, తుమ్మెదరెక్కలమీంచి కూడా
నా హృదయంలో జొరబడుతున్నారు.

నా పుస్తకాలు తెరుస్తారు, బొమ్మలు తిరగేస్తారు
నేరుగా వంటింట్లోకి పోయి టీపెట్టుకు తాగుతారు
ఊరికే ఛలోక్తులు విసురుకుంటారు, బిగ్గరగా నవ్వుకుంటారు
కొందరు 'హుష్, హుష్ చప్పుడుచెయ్యకండి' అంటారు.

అకస్మాత్తుగా అనిపించింది నాకు,
నీ జీవితంలోనైనా నా జీవితంలోనైనా
అడుగుపెట్టే మనుషులు
బహుశా తాళంచెవులగుత్తి లాంటివారని.

ఒక్కొక్క తాళం చెవితో
ఒక్కొక్క గదితలుపు తెరుచుకుంటుందని.

కొన్ని గదుల్లో ఉత్త ఖాళీ,
కొన్నింట్లో దివ్యపరిమళవిభూతి
కొన్ని పూర్వజ్ఞాపకాల నీడల్తో కలవరపరుస్తాయి.

ఏమైతేనేం ఎన్ని గదులు తెరుచుకుంటే
నీకు నువ్వంతగా ఎరుకపడతావు.

30-5-2014

## బుట్టెడు బంగారుధూళి

yes, in spite of all
some shape of beauty moves away the pall
From our dark spirits...

*John Keats ( Endymion 1:11-12)*

మరీ ఒక్కొక్కప్పుడు
ప్రతి స్నేహమూ, ప్రేమా
పొగలాగా మనసంతా కమ్మేసినప్పుడు,
నీ వెనకనో, పక్కనో సణుగుతూనో సాధిస్తూనో
వెంటాడుతున్నప్పుడు,
నీ మనసే రెండుగా చీలిపోయి తనకి తనే
అడ్డుపడుతున్నప్పుడు,
మరేం చెయ్యాలో తోచనప్పుడు
నీ ప్రభావం నుంచి నువ్వే బయటపడాలనుకున్నప్పుడు–

కీట్సు ఒక ప్రాచీన గ్రీకుపానపాత్ర[11] ముందు
మోకరిల్లినట్టు,
నువ్వొక పూర్వజ్ఞాపకం పాదాలకు చుట్టుకుపోతావు.

ఏట్సు ఇన్నిస్ ఫ్రీ సరోవరానికి[12] పోవాలని కలగన్నట్టు,
నువ్వు నీ చిన్నప్పటి గిరిజనగ్రామాలకోసం
ఒకటే కొట్టుకుపోతావు.

మార్గశిర ప్రత్యూషాల్లో
ఇంకా ఆకాశాన్ని వదల్లేని జాబిల్లి
రాత్రంతా కార్చిన కన్నీరు

చివరి పున్నాగపూల సౌరభంలా
గాల్లో గడ్డకట్టిపోతుంది.

ఎన్నాళ్ళుగానో
నువ్వు చిత్రిస్తూ వస్తున్న
సుందరమానవముఖచిత్రాన్ని
మరొకసారి మళ్ళా
నీ ఇటీవలి స్నేహితుడో, స్నేహితురాలో
అపహాస్యం చేసినప్పుడు
తేడా ఎక్కడుంది,
గీతల్లోనా, రంగుల్లోనా,
మొదటి పూత ఆరకుండానే మళ్ళా పైపూతకోసం
పడ్డ తొందరలోనా అనుకుంటో
నిన్ను నువ్వు నిలదీసుకుంటున్నప్పుడు–

బహుశా అప్పుడు నువ్వు చెయ్యగలిగిందల్లా
ఏదో ఒక కవితాసంకలనం తెరిచి చదవడం.

ఆ కవులెవరైనా కావచ్చు,
ఇషికవా తకుబొకు[13] నే కావచ్చు.

నీలాగే అతడు కూడా
రంగురంగుబొమ్మల్తో ఆడుకోవాలనుకున్నాడు.

రోగం, దరిద్రం, ఇంట్లో గొడవ, బయట తగాదాలు భరించలేక
అర్థాంతరంగా ఈ లోకాన్ని వదిలిపెట్టేటప్పటికి,
అతడీ లోకానికి మిగిల్చిందల్లా
గుప్పెడు ఇసుక[14].

పుస్తకం మూస్తూనే నీకు కలిగే కోరిక
ఈ లోకం మీద దోసిళ్ళతో చామంతులు
విరజిమ్మాలని.

ఇక అప్పుడు, అంతా నిద్రపోతున్నప్పుడు
నువ్వొక గాలం పట్టుకుని
కోసిన పంటపొలాలమ్మట ప్రయాణిస్తావు.

అట్లా నిద్రలేని ఒక రాత్రంతా గడిచేటప్పటికి
నీ తాటాకుబుట్టలో
బుట్టెడు బంగారుధూళి.

11-12-2014

## నా చామంతి తోట: అయిదు తంకాలు[15]

1

ఎక్కడో ఒక బంగారు వాకిలి
తెరుచుకున్నట్టుంది,
నింగిన బాజాభజంత్రీలు–
ఇక్కడ నా ఇంటిముంగిట
కురిసిన పసుపు,కుంకుమ.

*2*

రోజూ ప్రతి సాయంకాలం
రెస్టారెంట్లో టేబుల్ చుట్టూ
తలపులుకలబోసుకున్నట్టు–
ఈ అద్దె ఇంట్లో నేనూ
నా చామంతి మొక్కలు.

*3*

ఒకప్పుడు నేనెంతమందికో
ఎన్నో ఉత్తరాలు రాసాను,
ఇన్నాళ్ళకు నిన్నరాత్రి–
చంద్రుడు నా ఇంట్లో
గుమ్మరించిన ప్రేమలేఖలు.

4

చిన్నప్పణ్ణుంచీ నన్ను
వెంటాడే బెంగ–
ఆడుకోడానికి ఎవరు
తెచ్చిపెట్టారీ లక్కపిడతలు,
గిలక్కాయలు?

5

నా జీవితాన్ని దుక్కిదున్ని
చామంతులు చల్లుకున్నాను.
పగలు సూర్యుడు,
రాత్రి చంద్రుడు–
పంటపండేది హృదయంలో.

1-1-2015

## ఇప్పుడర్థమవుతోంది

ఒక చీనాచిత్రలేఖనం[16] చూసాను.

ఇద్దరు కవులు చేపలు పట్టడానికి కూచున్నారు,
చేతుల్లో గాలాలు, తామరపూల కొలను
పసుపూ, నీలం పెనవేసుకున్న లోకం.

వాళ్ళొక్క చేప కూడా పట్టలేదుగాని
ఆ వేసవికంతా సరిపోయేటంత
ఆంతరంగప్రశాంతి పట్టుకున్నారట.

అప్పుడు మనిద్దరం కూడా ఇట్లానే
తిరిగాం కద.

చూపులు గాలాలుగా,
హృదయాలు గంపల్లా తగిలించుకుని.

ఆ ధనుర్మాసపు మలుపుల్లో
నువ్వో కొసన, నేనో కొసన
పాలసముద్రాన్ని చిలికినప్పుడల్లా
ఒకదాని వెనక ఒకటి
క్రిస్మస్ తారలు, శుభాకాంక్షలు
కొత్తసంవత్సరానికి చేతులుచాపుతూ
ప్రభవించడం చూసాం కద.

ఊరికినే మనమట్లా తిరుగుతూంటేనే
వెలుతురు తలుపులొక్కొకటీ
బార్లా తెరుచుకున్నాయప్పుడు.

చీకటిమైదానం మీద
కాంతి జల్లుపడుతూనే మనమొక కారులో
ఒకరికొకరం దగ్గరగా జరిగి
ఒకరిచేతులొకరం గట్టిగా పట్టుకున్నాం.

మరేం చెయ్యాలో తెలీక మహానందంతో
ముద్దుపెట్టుకున్నాం, మైమరచాం.

చలిమధ్య, చీకటిమధ్య
చామంతితోటలాగా విప్పారాం.

ఎందుకనో జీవితమెప్పటికీ
అట్లానే ఉంటుందనుకున్నాం.

పండుదానిమ్మ మీద పరచుకున్న
మహామోహరాగరేఖలాగా–
రోజులువిప్పారుతూనే
రత్నాలు రాలిపడతాయనుకున్నాం.

అప్పుడు తెలియలేదుగానీ
ఇప్పుడర్థమవుతోంది–

అప్పుడు మనం పోగుచేసుకున్నదేదో
అక్కడే జారిపోయిందని.

12-1-2015

## నాక్కూడా అదే అనిపించింది

అప్పుడు విమానం బయలుదేరేముందు
ఆ ఎయిర్ హోస్టెసు అమ్మాయిలు
ఎప్పట్లానే జాగ్రత్తలు చెప్పారు.

ఎప్పుడూ ప్రతిసారీచెప్పినట్లే
మళ్ళా మరొకసారి,
శ్రద్ధగా, నెరవేర్చవలసిన ధర్మమేదో
నెరవేరుస్తున్నట్టు.

ఎప్పుడూ విన్నట్టే యాత్రీకులు
మళ్ళా మరొకసారి ఆ మాటలు విన్నారు.

కాని వినిపించుకున్నట్టులేదు.

అయినా వాళ్ళు చెప్పవలసినమాటలేవో చెప్పారు,
ఒక్కరేనా కొత్త శ్రోత ఉండరా అన్నట్టు.

చెప్పవలసిందేదో చెప్పెయ్యగానే
ఒక పక్క ఒదిగి కూర్చున్నారు,
ఇప్పుడో మరునిముషమో విమానం బయలుదేరడానికి
ఎదురుచూస్తూ.

నాక్కూడా అదే అనిపించింది–

చెప్పవలసిన నాలుగు మాటలూ చెప్పేసి
మీతో కలిసి మౌనంగా పైకెగరాలని.

16–1–2015

## నిండుగాపూసిన మామిడిచెట్టుఎదట

మధ్యాహ్నం ఎండ వాలు తిరిగినప్పుడు
సందులో ఎవరో పిలిచినట్టు-

కాకరపాడుసంతలో నేను కనిపించకపోతే
'చంటీ ' అని మా నాన్నగారు
పిలుస్తున్నారా?

పంటనూర్పు కళ్ళందగ్గర నిలబడి
బస్తాలు బళ్ళకెక్కిస్తూ
మా ఊరి రైతులెవరో పలకరిస్తున్నారా?

ఒక్క అడుగు వెనక్కి వేసాను-

చిరపరిచితమైన ఆ పిలుపు
నిండుగా పూసిన మామిడిచెట్టుది.

ఆ కొండలవరసకి అవతల
ఏదో ఊరేగింపు సాగుతున్నట్టు
బాజాలు, వీరణాలు,
విరజిమ్మిన సాంబ్రాణిపొగ.

ఏటికవతల ఎవరో వస్త్రాలు ఆరబెట్టుకుంటున్నట్టు
ఒకింతచల్లని, ఒకింత నునువెచ్చని
శుభ్రపరిమళం.

ప్రవాసంనుంచి స్వదేశానికి మళ్ళిన
పక్షిరెక్కలు రేపిన జ్ఞాపకాలదుమ్ము.

పండగముగిసిన తరువాత
ఊరువదిలి వచ్చేటప్పుడు
గొంతుకి అడ్డం పడ్డ బెంగ.

ఎప్పుడో కలిసిపాడుకున్న పాటలన్నీ
మళ్ళా ముంచెత్తినట్టు కొత్తపూత.

నిండుగాపూసిన మామిడిచెట్టుఎదట
ఏ ఒక్కరూ ఒంటరికారు.

19-1-2015

# ఇద్దరు లేరు

గుంటూరు దగ్గర డా.నన్నపనేని మంగాదేవిగారు నడుపుతున్న చేతన ఆశ్రమం అందమైన పూలతోట, పూలు విరిసినట్టుండే పాఠశాల. అక్కడి చెట్లనీడన చిన్నారుల్తో మాట్లాడుతూ, దేవాలయంలో దేవుడికి కూడా చెట్ల నుంచే ప్రాణశక్తి దొరుకుతుందని చెప్పాను. మాటలు ముగించాక మళ్ళా  ఆ ప్రాంగణంలో నడుస్తూ ఉండగా:

హటాత్తుగా చెట్టువెనకనుంచి ముందుకొచ్చి
అడిగాడా పసికూన:

దేవుడికి చెట్టు దిక్కన్నావు, మరి
చెట్టునెవడు పుట్టించాడు?

నాన్నా! నిన్నూ,నీ ప్రశ్ననీ
బహుశా ఈ జన్మకి మర్చిపోలేననుకున్నాను.

ఆలోచిస్తూనే ఉన్నానింకా-
దేవుడికి చెట్టు ఆధారమా
చెట్టుకి దేవుడాధారమా?

చెట్టుదేవుడిగా మారిన
శ్రీజగన్నాథస్వామి ఎదట నిల్చున్నప్పుడు-
బయటపడ్డానా ప్రశ్ననుంచి.
రెండు లేవు, ఒకటే ఉందని.

చెప్పినవాడూ, అడిగినవాడూ-
ఇద్దరు లేరు, ఉన్నదొక్కరేనని.

26-1-2015

## పువ్వుతో మటుకే

నీ దేహంలోంచి మనసులోకో
మనసునుంచి దేహంలోకో
ఒక ముల్లు ప్రవేశించింది.

ఒక పూరింట్లో పాము చొరబడ్డట్టు
నీకు అహర్నిశలూ ఒకటే చింత.

నీకు సంతోషమనిపించినప్పుడు
సంతోషంగానో
నిరాశకమ్మినప్పుడు
నిస్పృహతోనో
మామూలుగా నడిచే జీవితం
మామూలుగా నడిస్తే ఎంత బాగుణ్ణు.

కాని నీ రక్తంలో ఒక శల్యం-

ప్రతి క్షణం అది
నీ గుండె తలుపులు తట్టినప్పుడు
తలుపులు తియ్యాలి,
బయటకు వెళ్ళేటప్పుడు
తలుపులు ముయ్యాలి.

అమ్మయ్య, ఇక తలుపులు మూసేసావనుకునేటంతలో
హృదయప్రసరణం చుట్టుతిరిగి
మళ్ళా ముల్లు ప్రత్యక్షం.

ఏ క్షణాన ఆ పువ్వుని చూసి మోహపడ్డావో
ఆ క్షణమే ముల్లుని తలదాల్చావు.

చిన్ని ముల్లే, అయితేనేం
ఒక రంపంగా నిన్ను కోసేస్తూనే ఉంది.

ఇన్నాళ్ళూ ముల్లుని ముల్లుతో
తియ్యాలని చూసావు, చాతకాలేదు.

ఇప్పుడు తెలిసింది నీకు
ముల్లుని ముల్లుతో కాదు, పువ్వుతో తియ్యాలని.

26-1-2015

## మాఘమాసపు అడవి ఎదట

మాఘమాసపు అడవి ఎదట నేను మళ్ళా
పదేళ్ళ బాలుణ్ణి కావాలని ఉంది.

పాతికేళ్ళ యువకుణ్ణి కూడా.

చెట్లు ఆకులు రాలుస్తుండే దృశ్యం
చూస్తూనే ఒక జీవితకాలం గడిచిపోయింది.

కృష్ణదేవిపేట ఏడొంపులఘాటి[17]
కాకరపాడునుంచి బోయపాడు[18] వెళ్ళే డొంకదారి
గుమ్మలక్ష్మిపురం, కెరమెరి, నల్లమలకొండల్లో
ప్రతి ఒక్కచోటా మాఘమాసం
నా చిన్నప్పటి నల్లజీడిచెట్లతమకంతో
నన్ను హత్తుకుంటూనే ఉంది.

ప్రేమించాను,పోరాటం చేసాను
ఊడిగంచేసాను, ఉమ్ములు మోసాను
జీవితవాంఛ కొడిగట్టినప్పుడల్లా
ఒత్తి కత్తిరించి నన్ను సరిచేసే
దివ్యమానుషహస్తాలెక్కడని పరితపించాను.

ప్రపంచంతో రాజీపడలేను
పోనిమ్మని ఒదులుకోలేను
ఎప్పటికప్పుడు చిక్కుముడి పడుతున్న
నా మనోపాశాన్ని సరిదిద్దే
ఒక కేశపాశం కోసం
కలలుకనకుండా ఉండలేను.

ఇప్పుడిక్కడ నా ఇంటివాకిట
రోజంతా రాలుతున్న మామిడిపువ్వు.

గతించిన జీవితం తీపినిచ్చిందో, చేదువిరిగిందో
రేపటికి తెలుస్తుందని నమ్ముతూ
నిద్రలేని ప్రతిరాత్రీ ఈదుకొస్తున్నాను.

విస్ఫారితనేత్రాలతో ఒక అడవినో, కడలినో
తొలిసారిచూసినట్టుగా
ఈ ప్రపంచాన్ని చూడాలని సాధన చేస్తున్నాను.

బహుశా నన్ను నన్నుగా అంగీకరించే
కాలం, దేశం, నేస్తం కనిపించినప్పుడే
నా చిన్నప్పటి మాఘసూర్యకాంతి
మళ్ళా నా చేతికి చిక్కుతుందనుకుంటాను.

6-2-2015

## ప్రేమ కొనసాగాలంటే

రాజు మిళిందుడు నాగసేనుణ్ణి అడిగాడు: 'మనసు లక్షణమేమిటి, ప్రజ్ఞ లక్షణమేమిటి?'

'పట్టుకోవడం మనసు స్వభావం, తెంచుకోవడం ప్రజ్ఞ స్వభావం' అన్నాడు నాగసేనుడు.

'పట్టుకోవడం మనసు స్వభావమెట్లా అయ్యింది, తెంచుకోవడం ప్రజ్ఞ స్వభావమెట్లా అయ్యింది?' అని అడిగాడు రాజు. 'ఒక ఉదాహరణ చెప్పు' అన్నాడు:

'రాజా! మీరెప్పుడైనా గోధుమపంట కోతలు కొయ్యడం చూసారా?'

'చూసాను.'

'ఆ పంటపొలాలు ఎట్లా కోత కోస్తారు?

'ఎడమచేత్తో నాలుగైదు వెన్నులు పట్టుకుంటారు, కుడిచేత్తో కొడవలి పట్టుకుంటారు, పంటకోస్తారు.'

'సరిగ్గా అలానే ప్రభూ, మనసుతో పట్టుకోవాలి, ప్రజ్ఞతో తెంచుకోవాలి' అన్నాడు నాగసేనుడు.

–మిళిందపన్హా[19] 2.1.8 (32–33)

పట్టుకున్నంతకాలం పట్టుకునే ఉండిపోయాను
తెంచుకోవాలనుకున్నప్పుడు పరపరా తెంపేసాను.

రెండింటిలోనూ శాంతిలేదు,
దట్టంగా అల్లుకున్న పొగ తప్ప.

నువ్వు పట్టుకున్నప్పుడల్లా
ఒక సీతాకోకచిలుక నీ వేళ్ళ మధ్య
గిలగిలకొట్టుకుంటూనే ఉంది.
ఒక తూనీగ విలవిల్లాడుతూనే ఉంది.

నువ్వు వదిలిపెట్టేసినప్పుడల్లా
ఒక కుక్కపిల్ల ముణగదీసుకుని
చలిలో వణుకుతూనే ఉంది.

పంజరం తలుపులు తెరిచినా
పావురం బయటికి పోలేకుంది.

నువ్వెవరినైనా ప్రేమించడమంటే
నీకు నిష్కారణంగా దయకలగడం.

నిజమేకాని ప్రేమ కొనసాగాలంటే
నువ్వు నిర్దయకూడా నేర్చుకోవాలి.

10-2-2015

## సుగంధస్మృతి

The older you get, the more gardens you have abandoned..

*-Robert Bly (on remembering The Wind, One Brilliant Day, a poem by Antonio Machado)*

తెల్లవారిందనడానికి గుర్తుగా పార్కులో
చివరి దీపాలు కూడా ఆర్పేసాక
ఓడ వచ్చేముందు రేవుపట్టణమంతా తరంగితమయినట్టు
ఆకాశమంతా అరుణధూళి రేగినప్పుడు
అక్కడ, ఇంకా ఆకులు రాలుతున్న రావిచెట్టుమీద
కోకిల కూత విన్నాను.

ఈ ఏడాదికి మొదటి కూజితం.

సముద్రమ్మీంచి ఋతుపవనం భూమ్మీదకు మళ్ళుతూనే
కురిసిపోయిన చిరుజల్లులాగా,
వన్నె తిరిగిన పొలాల్లో
పాలుపోసుకొంటున్న తొలిజొన్నకంకిలాగా,
నీ అత్యంత ఆత్మీయులెవరో
కొత్త మొబైలు కొనుక్కోగానే
నిన్నే తొలిసారి పలకరించినట్టుగా.

పల్లెల్లో పండగ మొదలవుతూనే
బాజామీద తొలి దరువు పడ్డట్టు,
నర్తకి రంగస్థలం మీద
అడుగుపెట్టగానే తొలిమువ్వ మోగినట్టు,
కల్యాణఘడియరాగానే
తొలిసారి పసుపు దంచినట్టు.

ఆ పిలుపు వినబడుతూనే
ఆకాశం ఒక్కసారి ఉలిక్కిపడింది.

గతించిపోయాయనుకున్న కాలాలన్నీ
గతించిపోనేలేదనీ-
ఒదిలిపెట్టి వెళ్ళిపోయారనుకున్నవాళ్ళెవ్వరూ
నిజంగా వదిలిపెట్టిపోనే లేదనీ-
ఏళ్ళు గడిచేకొద్దీ బహుశా
ఒకప్పటి తోటలకి దూరం కావచ్చేమోగానీ
సుగంధస్మృతికి కానేకాదనీ-

ఆ పొద్దున్నే కోకిలపిలుపు వినగానే
ఏడాదిగా మా మధ్యమాటల్లేని మిత్రురాలు
మళ్ళా నాతో మాట్లాడినట్టనిపించింది.

15-3-2015

## ఒక తెల్లవారుజామున ఉట్నూరు బస్ స్టాండ్ లో బస్సు దిగగానే నిండుగా పూసిన వేపచెట్టు స్వాగతించినప్పుడు

Like the red beginnings of a rose..

*Pablo Neruda* ( *Sonnet:69*)

అలా మొదలయ్యింది కొత్త సంవత్సరం
మళ్ళా ఒక అడవిపల్లెలో.

భూమ్యాకాశాల మధ్య ఇంకా చెదిరిపోని
గుసగుసలాగా వేపపూల తీపిగాలి.

నిన్న మా ఊళ్ళో మళ్ళా కొత్తమాస
తిరణాల జరిగే ఉంటుంది.
ఊదుకున్న బూరాలు, చల్లుకున్న రంగులు
ఆకాశమంతా చెలరేగిన
ఆనవాలుగా నక్షత్రాల చివరిమినుకు.

మమతతో, మోహంతో దగ్గరయ్యాక
మరేం చెయ్యాలో తెలీని రెండుహృదయాల్ని
కలిపి కుట్టిన ముద్దులాగా
గతాగతాల తొలిసంధ్య.
అక్కడ చిమ్మిన ఋతుధూళి,
ఇక్కడ నా ఒళ్ళంతా తడిపిన
అనాది సంతోషం.

రాత్రంతా చెట్లమీద కురిసిన
ఆకుపచ్చ కుండపోత

తెల్లవారేక ఈ లోకాన్ని
మరింత జీవించదగ్గదిగా చూపిస్తుంది.

కొండగన్నేరుపువ్వులాగా
కొత్త ఏడాది విచ్చుకున్నప్పుడు
నా రంగులపెట్టె
మళ్లీ పరిమళించడం మొదలుపెడుతుంది.

నా తొలిదినాల రాత్రుల జ్ఞాపకాలు
ఏ అతీతపుష్పమకరందాన్నో కరిచితెచ్చుకుని
ఒక తేనెపట్టు అల్లడం మొదలుపెడతాయి.

దృశ్యాదృశ్యసత్యమంతా
ఆద్యంతవేళల్లో ప్రణవనాదంగానే మిగులుతుందంటే
బహుశా అర్థమిదే:

దృశ్యపర్యవసానం శబ్దమని అంగీకరించడమే.

ఇన్నేళ్ళుగా మనం మాట్లాడుకున్న మాటలు,
చీనానుంచి చిలీదాకా
పాడుకున్న పాటలు, పద్యాలు
గాల్లో చేరి దిగంతాన్ని తాకి
ప్రతిధ్వనించినప్పుడు-

ఈ పొద్దున్నే ఏ కొండలోయలోంచో
కవీ, నువ్వే కోకిలగా మారి
నాకో కొత్త పద్యం వినిపిస్తున్నావు.

21-3-2015

## కన్నెగంటి రామారావు ఇన్నిస్ ఫ్రీ సరోవరం దగ్గర నిలబడి నన్ను తలుచుకున్నప్పుడు

వైశాఖం ప్రవేశించినప్పుడు
ఉండవలసింది నువ్వా కొండల్లో.

ఇక్కడ నగరవీథుల్లో
దట్టంగా పరుచుకున్న చెట్టునీడలు కూడా
నీకు తూర్పుకనుమల్లానే కనిపిస్తాయి.

వేసవిరాత్రుల్లో మీ ఊళ్ళో నాటకాలు వేసేవాళ్ళు,
ఎప్పుడు రాత్రవుతుందా అని రోజంతా చూసేవాడివి,
మాసిపోయినకోరారంగు తెరవెనక
వాళ్ళు హారతిపట్టి 'పరబ్రహ్మ పరమేశ్వర' అనగానే
నీలోనూ ఒక నాటక ప్రదర్శన మొదలయ్యేది.

ఆ తోలుబొమ్మలాటలు,
ఆ ఏటి ఒడ్డున
జాగరాలమ్మ గుడిముంగిట
జక్కుల భాగోతం
నువ్విప్పటికీ ఆ ఊరు వదిలిపెట్టిరానే లేదు.

ఇప్పుడు నిన్నొకరు ఒక సరస్తీరం చెంతన
తలుచుకున్నారనగానే
నువ్వు ప్రాచీన చీనానగరం చాంగాన్[20] వెళ్ళిపోయావు
వీథుల్లో రాలుతున్న పసుపు పూలమధ్య నడుస్తూ
ప్రాచీన చీనాకవిలాగా నువ్వు కూడా ఇంకా
కొండమీద అతిథి[21] నిద్రలేవలేదనుకుంటావు.

ఏడాది పొడుగునా ఎట్లాగేనా గడవనివ్వు,
వైశాఖం వస్తూనే సోమరివేసవిక్షణాలు తెస్తుందని
ఇంకా నీ ఎదురుచూపు.

ఎన్ని గ్రంథాలతో తుడిచెయ్యాలని చూసినా
ఎన్నటికీ చెరగని
నీ బాల్యపు మరక.

22-4-2015

## అన్నిటికన్నాముందు

అంతా ఆదమరిచినిద్రపోయే అర్థరాత్రి
బయటకివచ్చిచూడు.

మామిడిచెట్ల కొమ్మలమధ్య మాఘమాసపుగాలి
ఊయెల్లో పసిపాపలాగా
కనులరమోడ్చి తనలోతనే
నవ్వుకుంటూ కనిపిస్తుంది.

ఎవరూ సొంతంచేసుకోని ఆ చివరిజాము రాత్రి
చంద్రుడొక్కడూ నాకోసం వేచిఉంటాడు.

అనార్ద్ర లోహశకలంలాంటినన్ను
అయస్కాంతశిలలాగా అతడు తాకగానే
చేతుల్లాగా ప్రాణాలు చాపి
రాత్రంతా ఆకాశాన్ని పట్టుకు వేలాడుతుంటాను.

లోయలో సెలయేటివద్ద
రాత్రి చిరుతపులులు నీళ్ళుతాగేటప్పుడు
ఈ చంద్రుడే కదా ఒక కంటకనిపెట్టి ఉంటాడు

అందుకని నా మనోకాననంలో కూడా
ఒక దివ్వెనట్లా
ఎప్పటికీ వెలిగించిపెట్టుకుంటాను.

రైల్లో ప్రయాణీకురాలు
తెల్లవారుతూనే అన్నిటికన్నాముందు
జుత్తు దువ్వుకుని జడవేసుకున్నట్టు

నేను కూడా వేకువకాగానే
రాత్రంతా చిక్కుముళ్ళు పడ్డ నా తలపుల్నిట్లా
ఒద్దిగ్గా ఒక పక్కకు అల్లుకుంటాను.

2-12-2015

## శరద్రాతుల మలుపు దగ్గర

శరద్రాతుల మలుపు దగ్గర
నైట్ క్వీన్ మార్గశిరం కోసం వేచివుంది,

రాత్రంతా అది విరజిమ్మిన పరిమళం
ఇప్పుడెక్కడో పంటపొలాలమీద
తొలిమంచు దుప్పటిగా పరుచుకుంది.

పండివాలిన వరికంకులమీద
గునుగుపూలు రాలినట్టు,
రాత్రంతా సీతాకోకచిలుక
పూలకలలే కన్నట్టు,

నాకు తెలుసు, ఇప్పుడు వీథి చివర
ఎవరో బలలైకా[22] వాయిస్తున్నారు,
అతడి చుట్టూ కిర్గిజిస్థాన్ కొండదేవతలు
తేనెటీగల్లా మూగిఉంటారు.

ఇన్నాళ్ళూ మనుషులకోసం బతికాను,
ఇప్పుడు కొన్నాళ్ళు దేవతలకోసం
బతకాలని ఉంది.

మనుషుల్ని ప్రేమించినంతకాలం
రాక్షసుల్ని సహిస్తూ గడిపాను,
ప్లీజ్, కొన్ని క్షణాల పాటేనా
ఇప్పుడొక దేవతను ధ్యానించనివ్వండి.

నా మటుకు నన్ను వదిలిపెడితే
ఈ జీవితానికి ఆదిమధ్యాంతాల ధ్యాస పట్టదు నాకు,
మిత్రులకోసమో, నన్ను నమ్ముకున్నవాళ్ళ కోసమో కాకపోతే
ఈ జీవితానికొక అర్థం వెతకాలన్న ఆత్రుత లేదు నాకు.

విడిగానూ, విరివిగానూ వెదజల్లిన
సౌందర్యాన్ని శిల్పంగా మలచాలన్నది
నా యవ్వనకాలం నాటి భ్రమ,

ఎంత హింస అందులో.

ఇప్పుడెందుకో మాటిమాటికి,
చిన్న నిక్కరు పైకి లాక్కుంటున్న
ఆ చిన్నప్పటి పిల్లవాడే కనిపిస్తున్నాడు

కళ్ళమ్మట నీళ్ళాగడం లేదు.

నేను నైట్ క్వీన్ ని ఇష్టపడ్డట్టు
నైట్ క్వీన్ కూడా నన్నిష్టపడితే!

14-12-2015

## ఫిబ్రవరి రాగానే

ఫిబ్రవరి రాగానే మంకెనలు పూస్తాయనుకునేవాణ్ణి,
కాదు, మంకెనలు మొగ్గతొడుగుతూనే
ఒక మాఘమాసాన్ని సృష్టిస్తాయి.

నిండుగా పూసినమంకెనలచుట్టూ
నీలిపొరలు,ఉదారంగుధూళి–
నా బాల్యంలో పూర్తిగా వినలేకపోయిన
పాటలన్నీ మళ్ళా అక్కడ ప్రత్యక్షమవుతాయి.

నేను తిరిగిన కొండలదారుల్లో
రాలిన ఇప్పపూలు,నల్లజీడిచెట్లు,తపసిమాకులు[23]–
సంతనుంచి ఆవును పల్లెకు తీసుకుపోతున్న రైతులా
మాఘమాసం నన్ను నగరంనుంచి అడివికి తీసుకుపోతుంది.

ఇన్నేళ్ళుగా ఎంతో ప్రయత్నించాను
మరొక కొత్త దృశ్యమేదన్నా నన్ను ప్రలోభపరుస్తుందని
వేచి చూసాను.
నన్ను మైమరిపించగల ఒక మనిషి ఉనికికోసం
నా జీవితం సర్వం సమర్పించడానికి సిద్ధపడ్డాను.

పూసినమంకెనచెట్లు కనబడగానే
ప్రపంచంనాకు నేర్పిన పాఠాలన్నీమర్చిపోతాను.
రంగులెట్లా కలపాలో ఎంతసాధనచేసినా
రంగులపళ్ళెం ముందు నిలబడ్డప్పుడు తొట్రుపడ్డట్టే
మాఘమాసం ఎదట నేను మూగబోతాను.

ఇప్పటి మనుషులు ద్వేషించుకోడం, దూషించుకోడంకాకుండా
మరేమన్నా చేసారా అని
వందేళ్ళ తరువాత ఒక పిపాసి అనుకున్నాడనుకో,
చూడు, చినవీరభద్రుడు మంకెనల ఎదట
సొమ్మసిల్లిపోయాడని ఈ కవిత గుసగుసలాడుతుంది.

2-3-2016

## నామదేవుడూ, మొఘల్ సిపాయీ[24]

ఒకప్పుడు ద్వారకలో కృష్ణతన్మయుడై
పాటలు పాడుకుంటున్న నామదేవుణ్ణి
గుర్రం మీద పోతున్న ఒక సిపాయి ఆపేసాడట,
నెత్తిన బరువు పెట్టి వెట్టి చేయించాడట.

ఆహా, తన ప్రభువే అట్లా మొఘలు వేషం
వేసుకున్నాడని మరింత కైమోడ్చాడు నామదేవుడు.

ఇప్పుడు స్కార్పియోలమీద పోతున్నవాళ్ళు,
పెద్దపెద్ద ఎయిర్ కండిషన్డ్ రూముల్లో కూర్చున్నవాళ్ళు,
ఫాల్గుణమాసపు వేపచెట్టు కింద నేను పరవశిస్తూ ఉండగా
అర్జంటుగా మొబైల్లో ఆదేశాలు పంపేవాళ్ళూ-

ప్రభూ,

నిజం చెప్పు,
వీళ్ళంతా కూడా నీ రూపాలేనా?

14-3-2016

## మండు వేసవి వేళ

మండువేసవి లోన
మల్లె పూసినదేల?
మలగిపోయిన స్మృతుల
మరల మెదిపినదేల.

ఎండ ముగిసిన సంజ
ఏదొ వేదన జ్వాల,
ఎవరి తీయని తలపు
పొటమరించెను నేల.

మండు వేసవిలోన
మల్లె పూసినదేల.

పగలు రగిలిన ఎండ
పరిమళమ్ముగ మారి
తాను తుమ్మెద రీతి
నన్ను పువ్వును చేసి-

మండు వేసవి వేళ
మల్లె పూసిన దేల.

తరలి పోయిన ప్రేమ
తిరిగి తట్టిన తలుపు,
కరకు యాతన కొసన
కవిత కోకిల పిలుపు.

మండు వేసవి వేళ
మల్లె పూసిన దేల.

19-4-2016

## పూలు పూలు పూలు పూసి

పూలు పూలు పూలు పూసి పలకరించు తావిలా
కేలు కేలు కేలు కలిపి పాడుకున్న పాటలా
మేలు మేలు మేలనంచు పలుకు తేనె వాకలా

అమృతమ్మ పుట్టెనమ్మ
ఎంత మంచి పండగ!

అలలు అలలు అలలు పరిచి పట్టుకున్న వెన్నెలా
కలలు కలలు కలలు కలిపి కూర్చుకున్న కవితలా

అమృతమ్మ వెలిగెనమ్మ
ఎంతమంచి వేడుక!

పొరలి పొరలి పొరలి పొంగు జీవితోత్సవమ్మున
మరలి మరలి మరలి చూచు బాల్యస్మృతుల వెల్లువ
తరలి తరలి తరలి వచ్చు శుభాకాంక్ష వీచిక.

అమృతమ్మ పెరిగెనమ్మ
అలుపు లేని పాటగ!

12-5-2016

## జెండాకొండ : కొన్ని హైకూలు

1

మా ఊళ్ళో జెండాకొండ:
ఏళ్ళ తరువాత పైకెక్కుతుంటే
వెనక్కి నడిచినట్టుంది.

2

కొండకింద మట్టిబాట:
దానికటూ ఇటూ మనసులోనే
గుల్మొహర్లు నాటుకున్నాను.

3

కొండమీద కాక్టై,
దీన్నీ వదలని సీతాకోక:
నగరంలో నా ప్రేమపిపాసలానే.

4

రాత్రి వానకి తడిసిన అడివి,
ఏదో చెప్పాలని కంపిస్తున్నది:
కోకిల కూత.

5

కొండకిందలోయలో అదే పల్లె:
లేనివల్లా
మా అమ్మ, మా ఇల్లు.

## 6

నిన్న కొండల్లో కురిసినవాన
ఏటినిండా ఎర్రనీళ్ళు:
వేసవిలో వర్ష ఋతువు.

## 7

మలివేసవి:
రేలపూలు రంగువెలిసాయని
చింతచెట్టు కొంగలు పూసింది.

## 8

కిందకి దిగుతుంటే
వెనక్కి లాగిన ముళ్ళతీగ:
నన్నెవరూ ఇట్లా ఆపింది లేదు.

## 9

వైశాఖమాసపు చివరిదినాలు
పల్లేరుగుబుర్లలో సీతాకోకలు:
ఈ రోజు ముగుస్తుందనుకోను.

## 10

బషోకి ఫ్యూజియామ[25]
నాకు జెండాకొండ-
ఈ దుగ్ధ చల్లారదు.

4-7-2016

## వివరించలేని వేదన

'నారీ పురిష్ బసై ఇక్ సంగా, దిన్ దిన్ జాయి అబోలై..'

–కబీర్ (కబీర్ గ్రంథావళి: 316)

వివరించలేని వేదన,
చెప్పినా అర్థం కాని వేదన.

అవును,అదే సమస్య, మాటల్లేకుండా
రోజులకి రోజులు గడిచిపోతుంటాయి
పొద్దుటి సూర్యకాంతి,సాయం సంధ్య
వాననీళ్ళు పడెలు కట్టిన పొలాలు
ఇట్లా చీకటి పడగానే అట్లా ముస్తాబై
వీథిలో అడుగుపెట్టే ఆషాఢ చంద్రుడు
నేను వింటున్నా వినకపోయినా, రోజూ
కుండీలో కూనిరాగాల కనకాంబరాలు.

ఇదే నాకర్థం కాదు
ఇవన్నీ నీ మాటలే కదా
అయినా ఎందుకని నాక్కూడా మాట్లాడాలనిపిస్తుంది
మాటలు పెగలడం లేదనిపిస్తుంది
మాటలకోసం ఎందుకిట్లా కొట్టుకుపోతున్నాను?

నీ సన్నిధి ఒక శరంలాగా
మనసుని ఛేదించినప్పుడల్లా
మాటలు, మాటలు, రక్తంలాగా
జివ్వున మాటలు చిమ్మాలని.

వివరించలేని వేదన
చెప్పినా అర్థం కాని వేదన.

21-7-2016

## అప్పుడు శ్రీకూర్మం[26]లో

అప్పుడు శ్రీకూర్మంలో
శ్రీకూర్మం ఎదట నిల్చున్నప్పుడు
నాలోపల ఏదో సంభవించింది,
లేదా నాకు సంభవిస్తున్నదేదో
క్షణమాత్రం పాటు ఆగిపోయింది.

ఆ క్షణం జరిగిందేదేదో
గుర్తుపట్టాలని ప్రయత్నిస్తున్నాను.
అది క్షణం కూడా కాదు,
ఒక సూర్యశకలం, కొంత నక్షత్రధూళి
భూమిగా రూపుదిద్దుకున్నప్పుడు
నీలిరోదసిలో వినిపించిన ప్రథమస్పందన.

బహుశా అది మొదటిసారి శబ్దం
శబ్దాన్ని విన్న మెలకువ కావచ్చు.

లేదా నన్ను కబళిస్తూ వస్తున్న
ఊహ, భ్రమ, వేదన, పారవశ్యప్రకంపన
నన్ను వదిలిపెట్టిన
మహావిమోచనీయమధురక్షణమేనా కావచ్చు.

అక్కడొక చతుర్భుజ, అష్టభుజ
అనంతభుజమూర్తిని చూస్తానని
ఎందుకనుకున్నానో తెలియదు–
అది పేర్లుగా, రూపాలుగా, కొలతలుగా
పొగ, ప్రయాస, పరిరంభంగా

విస్తరించిన నా ప్రపంచాన్ని
ఒక్కసారికి కిందకు గుంజినట్టుంది,
పిల్లవాడు గాలిపటం
దారం వెనక్కి లాగినట్టు.

ప్రయత్నాలు, ప్రయోగాలు, ప్రగల్భాలు,
పరితోషణాత్మక ప్రభావాలన్నిటినీ
హోటల్లో సర్వరు ఎంగిలిబల్ల తుడిచినంత
నిర్లిప్తంగా
ఒక దయామూర్తి
తుడిచిపెట్టేసిన ముహూర్తమేనా కావచ్చు.

అక్కడ నా లోపల గదిలో
అప్పుడేం జరిగిందో
ఇంకా తొంగితొంగి చూస్తూనే వున్నాను.
అది చీకటి అనిగానీ వెలుతురు అనిగానీ
చెప్పలేను.
భాష లేని, భావానికి దొరకని
సృష్టిపూర్వ, ప్రళయానంతర
సంస్థితి.

అప్పుడు బహుశా నాకొక తెలివిడి కలిగిఉంటుంది
జ్ఞానం, విజ్ఞానం కాని ఒక ప్రజ్ఞానం,
బహుశా అనాదిగా నాకు తెలిసి కూడా
తెలుసునని ఆ క్షణందాకా తెలిసిరాని సంజ్ఞానం.

ఏ సత్యయుగంలోనో,
ఇంకా పశుపక్ష్యాదులు, వృక్షాలు,సర్పాలు,

మానవులు, మహీధరాలు పుట్టకముందే
ఒక నిశ్చింత ప్రతిష్ఠితమైంది.
నువ్వెంత చింతించినా
నీకు తెలుసు, నీ అడుగున, అట్టడుగునొక
నిశ్చింత నిశ్చలంగా నిలిచి ఉందని.

అక్కడ ఆ గర్భాలయంలో
ఆదికూర్మాన్ని చూసినప్పుడు
నా ఆనందమందరానికి ఊతంగా
అట్టడుగున అభయం కలిగిస్తున్నదేమిటో
అవగాహన కలిగింది.

ముందు నా తల్లిదండ్రులు
చిలికారు ఈ సాగరాన్ని
నేను పైకి తేలాను,
విషపాత్రనో, పీయూషకలశాన్నో-
తేల్చుకోకుండానే
కాలం గడిపేసాను.

ఈ క్షణాన నాకు గుర్తొస్తున్నది
చిలుకుతున్న కవ్వం పక్కన పెట్టి
మజ్జిగగిన్నెంతా కలయతిప్పి
మా అమ్మ పైకి తీసిన
వెన్నముద్ద.

19-2-2017

# నగరంలో ఫాల్గుణమాసం

the land lost with my childhood, suddenly came searching for me

*-Pablo Neruda (One Hundred Love Sonnets,VI)*

నగరంలో ఫాల్గుణం ప్రవేశించాక
నువ్వు మామూలుగా ఉండటం కష్టం.

రోజూ పొద్దున్నే నువ్వు ఇంటినుంచి
ప్రపంచం లోకి మలుపు తిరిగే వీథిలో
కొత్తగా జెండాలు ఎగురుతుంటాయి.

పెళ్ళికోసమో, ఆటలపోటీకోసమో
ఏదీకాకపోతే ఓటరులిస్టులు సవరించడానికో
రోడ్డుకడ్డంగా షామియానా వేసినట్టు
ఇప్పుడేదో కొత్త కలకలం నిన్నడ్డగిస్తుంది.

నీమీద తొలిరంగులజల్లు పడుతోందని
తెలుస్తుంది.
ఎంత తుడుచుకున్నా
ఆ వెలుతురు మరక చెరగదు.

నగరంలో ఫాల్గుణం అడుగుపెట్టిందని
నువ్వు గుర్తుపట్టేటప్పటికి
మర్చిపోయిన పాటలు, పెదాలు
పరిమళాలు నిన్ను చుట్టుముడతాయి
నీ అసలు నివాసం

'సుషమాసుధాగానమంజువాటి'[27] అని
మళ్ళీ గుర్తొస్తుంది.
ఆ పదాలమీద పేరుకున్న దుమ్ముని
ఊదేస్తూనే అవి తుమ్మెదలై ఎగిరిపోతాయి.

నువ్వు కిటికీలోంచి బయటికి చూడగానే
అక్కడ ఫాల్గుణం పన్నిన పసుపుపూల వలలో
నీ చూపులు చిక్కుకుంటాయి.

ఎప్పట్లానే మళ్ళా నగరంలో
ఫాల్గుణం నడిచివస్తుంటే
గాథాసప్తశతికి కొత్త అనువాదం
కొరియర్లో వస్తునట్టనిపిస్తుంది.

పొద్దుటివేళ పారదర్శకమైన
పలచనినీడలచుట్టూ కొంతచిక్కదనం తో పాటు
నీ చిన్నప్పుడు అమ్మ నీ చేతుల్లో పెట్టిన
పాలగ్లాసుగోరువెచ్చదనం కూడా.

ఎక్కడ చూడు,సిటీబస్సుల్లోంచి, ఆటోల్లోంచి
ఒకటే పెళ్ళివారు దిగుతుంటారు.
నువ్వాఫీసుకి వెళ్తావేగాని
నీ చిన్నప్పటి బంధువులెవరో, ఎక్కడో, ఎవరినో
నీ ఇంటికి అడ్రసు అడుగుతున్నారనిపిస్తుంది.

ఇప్పుడు నువ్వు ఆఫీసులో ఆ బూడిదరంగు
బ్లాక్ అండ్ వైట్ ఇంకుజెట్టులో
ఏది ప్రింటు తీసినా
రంగులే బయటికొస్తుంటాయి.

నగరంలో ఫాల్గుణం కుదురుకోగానే
నీ ఇంటిపక్కనొక గ్రామాకంపెనీ
డేరావేసినట్టే ఉంటుంది.
అర్థరాత్రి అంతా నిద్రపోతుంటారుగాని
నీకు మటుకు రాయబారం పద్యాలు వినిపిస్తుంటాయి.

దిరిసెనపువ్వులాంటి జ్ఞాపకమొకటి
నిన్ను రాపాడుతుంది, నువ్వు పగిలిపోతావు.

నీ చుట్టూ అట్టకట్టిన
ఇత్తడి, రాగి, సేవెండిరంగుల కోశంచిట్లి
తెల్లవారుతూనే
పసిడిరెక్కల పాటతో
నువ్వొక కోకిలగా బయటికొస్తావు.

21-3-2017

## వసంతం ఒట్టి చిగురు కాదు

వసంతం ఒట్టి చిగురుకాదు,
పువ్వు కాదు, పాట కాదు.
పదేపదే ప్రతి ఏటా నెరవేరే
ఒక వాగ్దానం, పునరుత్థానం.

15-4-2017

## గుచ్చుకుంటున్న దృశ్యం[28]

ఆ రైతులకి సంకెళ్ళు ఎందుకు వేసారు?
బహుశా, ఆ ప్రశ్న అడక్కుండా తప్పించుకోగలను,
కానీ, ఈ దృశ్యం గుచ్చుకోకుండా తప్పించుకోలేను.

13-5-2017

## తురాయిచెట్టు

'కంచువృషభముల అగ్నిశ్వాసం కక్కే గ్రీష్మం కదలాడీ..'

-శ్రీ శ్రీ (మహాప్రస్థానం: శైశవగీతి)

నాలుగుకొండలమధ్యా భగభగమండుతున్న కొలిమి,
లోయలో బుసలు కొడుతున్నగాలితిత్తులు.

కమ్మరి చక్రం తిప్పుతున్నాడు,
ఇత్తడి, రాగి, కాచం, సీసం
జీవితమూలధాతువులన్నీ
కట్టగట్టి కరిగించారు,
ఆగీ ఆగీ మంటమీద
ఆశాబాష్పాలు చిలకరించారు.

లోకమంతా ఎదురు చూసింది,
కొలిమిలో కరిగించి పోతపోసేదేమిటని?

ఉక్కుమెరుపులతో, తేనెమరకలతో,
జ్వాలామథనం నుంచి
ఉచ్చైశ్రవంలాగా బయటకొచ్చింది
ఖడ్గంకాదు, కాంస్యశిల్పంకాదు,

నిప్పుతునకలు నెత్తిన ధరించి
తురాయిచెట్టు.

27-5-2017

## ఇంకా ఎక్కడైనా ఒక బాలిక

ఇంకా ఎక్కడైనా ఒక బాలిక
ఈ రోజు చేతులకు గోరింటాకు పూసుకుంటే
చూడాలని ఉంది,
సెల్ ఫోన్లూ, వాట్సపులూ
కబళించని ఆ అరచేతులు
కళ్ళకద్దుకోవాలని ఉంది.

ఇంకా ఎక్కడైనా ఒక కుటుంబం
రోజంతా ఉపవాసం ఉండి
సాయం కాలం అట్లు పోసుకుంటే
చూడాలని ఉంది,
నూటొక్క ఛానెళ్ళు ముంచెత్తని
ఆ గృహసీమకు
అతిథిగా పోవాలని ఉంది.

ఇంకా ఎక్కడైనా ఒక గ్రామంలో
ఆరుబయట తదియవెన్నెల వెలుగులో
ఊరంతా ఉయ్యాలలూగుతుంటే
చూడాలని ఉంది,
కులాలూ, మతాలూ, ఓటర్లుగా చీలని
ఆ ఆదిమానవులమధ్యకుపోయి
ఊరేగాలని ఉంది.

8-10-2017

## కబీరు ఒకరోజు కాశీలో[29]

కబీరు ఒకరోజు కాశీలో
కచేరీకి వెళ్తున్న ఉద్యోగినొకణ్ణి
పలకరించాడు.

వాడినెత్తిన వంకర టోపీ,
వంకర నడక,
నోట్లో సగం నములుతున్న కిళ్ళీ–
ప్రేమ? భక్తి?
తీరికలేదంటో
దులుపుకుపోయాడు.

ఇప్పుడు
నాలో కచేరీ ఉద్యోగి
నాలో కబీరుతో
అంటున్నాడు:

'నా నెత్తిన వంకర టోపీ లేదు,
నేను తాంబూలం నమలడమూ లేదు,
ఒకటి మటుకు ఒప్పుకోవాలి–
నేను కచేరీలో చేరినప్పుడే
నడక వంకరటింకరైపోయింది.'

25-10-2017

## నువ్వు నిజంగా విన్నది

'వలసిన కాలం ఒక క్షణమాత్రపు సంజవేళ'

–బైరాగి (ఆగమగీతి: చెప్పనిది)

ఒక ఫిబ్రవరి సాయంకాలం, నగరంలో ఒక రెస్టరెంటు
రోడ్డుమీద చిక్కనవుతున్న జనసందోహం, సమ్మర్దం.
అప్పుడు, ఆదమరిచిన ఆ క్షణాన
నువ్వు ఎప్పుడో దాటి వచ్చిన ఏ దారిమలుపు పక్కనుంచో
ఒక మల్లెపిలుపు.

ఆ తర్వాత ఎన్ని జరిగాయి, ఎందర్ని కలిసావు,
ఎందరినుంచి విడిపోయావు,
ఎందరినుంచో దూరంగా పారిపోయావు.
ఇలా కాదు జీవించడమనుకుంటో
ఎన్ని ప్రణాళికలు వేసుకున్నావు
ఎన్ని ప్రయత్నాలు సగంలోనే తుంచేసావు.
అయినా, జన్మజన్మలకీ నిన్ను వెన్నంటివచ్చే
ఒక సుకృతంలాగా
ఆ మల్లెపిలుపు.

ఒక్క మాటకోసం,
నిన్నొక గాలిపటంలాగా ఎగరేసే రెండు హస్తాలకోసం
లోకాన్ని సంపద్వంతం చేసే మానవసమాజంకోసం
ఎన్ని రాత్రులు, ఎన్ని ఉదయాలు
ఏళ్ళకి ఏళ్ళు వెతుకులాడుతూనే గడిపేసావు.

బహుశా, ఒక జీవితకాలానికి నీకు మిగిలేది
ఒక క్షణమాత్రపు సంజవేళ.
నీ చుట్టూ హోరెత్తే
అగణితశబ్దసముదాయమంతటిలోనూ
నువ్వు నిజంగా విన్నది ఆ ఒకే ఒక్క
మల్లె పిలుపు.

23-3-2018

## కొండమీద అతిథి

1

ఫాల్గుణ పున్నమి-
ఏ దారిన దిగివచ్చాడో
మళ్ళా కొండమీద అతిథి.

2

అమ్మలేదు, నాన్న లేడు-
అయినా ఆ ఊరుగుర్తొస్తే
బాల్యం తిరిగొస్తుంది.

3

మా ఊళ్ళో వెన్నెల్లో
పిల్లలు ఆడుకుంటున్నారల్లే ఉంది-
వినిపిస్తున్నాయి కేరింతలిక్కడిదాకా.

4

నగరాకాశం పైన
ఫాల్గుణ చంద్రుడు-
ఇప్పుడెవరో నన్ను తలుచుకుంటున్నారు.

5

ముందు చంద్రుడు-
ఆ వెనకే నగరంలో నా ముంగిట
ఆ ఊరూ, ఆ కొండా.

## 6

ఫాల్గుణమాసపు వెన్నెల
తడిసిపోతున్న అపార్టుమెంట్లు–
వాళ్ళు లోపల టివి చూస్తున్నారు

## 7

వాట్సప్ లో బూరుగపువ్వు–
ఇప్పుడు ఫోను మీద కూడా
ఫాల్గుణమాసపు పుప్పొడి.

## 8

వెళ్ళిపోయాక వాళ్ళు మళ్ళా రాలేదు–
ప్రతి ఫాల్గుణమాసంలోనూ
చంద్రుడొక్కడే తిరిగొస్తాడు

## 9

ఫాల్గుణమాసం వేపచెట్లు–
సారం చేదు, పూలు తీపి
నా పద్యాల్లానే.

## 10

కాముని పున్నమి–
బయటకి చూస్తానంటాడు కాముడు
లోపలకి చూడమంటాడు చంద్రుడు.

24-3-2018

## ప్రతి ఏడూ చూస్తూనే ఉన్నాను

ప్రతి ఏడూ చూస్తూనే ఉన్నాను:
ఒక చెట్టులాగా ఉగాదిని
శిరసావహించడమింకా
సాధన చేస్తూనే ఉన్నాను.

పాతవన్నీ, పాతబడ్డవన్నీ
వాటికవే రాలిపోవాలని.
ఇల్లంతా తుడిచిపెట్టుకున్నట్టు
మనోదేహాలు తేటపడ్డాక
అరుగుమీద దీపం వెలిగించినట్టు
తరువుమీద చిగురు పొటమరించాలని.

ఎన్నేళ్ళుగానో తపనపడుతూనే ఉన్నాను:
ఒక చెరకులాగా ఉగాదిని
స్వీకరించడమెట్లానో తెలుసుకోవాలని.
నువ్వు పెరుగుతుంటే నీ మనసంతా
తీపి తప్ప మరేదీ మిగలకూడదని.
నిన్నెంత తుంచితే, అణిచితే
అంత మధురరసధార చిందుతుండాలని.

జీవితకాలంపొడుగుతా
నన్ను నేను శ్రుతిచేసుకుంటూనే ఉన్నాను:
ఒక కోకిలలాగా ఉగాదిని
స్వాగతించే విద్య పట్టుబడాలని.
నువ్వెవరివో, ఎక్కడుంటావో
ఏడాదిపొడుగునా ఏం చేస్తుంటావో–

నీ కూజితం వింటే చాలు
వాళ్ళకి వాసంతసంతోషమంతా
స్ఫురించాలని.

18-3-2018

## నా పద్యాన్ని చేరుకున్నాను

ఆ సాయంకాలం మేడమీద నిల్చున్నప్పుడు
సాయంకాలం సుగంధంగా మారుతున్నది.
దిగంతరేఖదాకా పొడిగించిన నగరం
సంధ్యాధూళిగా నింగిలో కలిసిపోతున్నది.
ఆకాశపు గడప దగ్గర నిలబడి మల్లికార్జున మాన్సూర్[30]
అప్రచలిత రాగాలాపనతో ధూపం వేస్తున్నాడు.

ఇంతదాకా జీవితం నా మీద వదిలిన మరకల్ని
ఆ నిశ్శబ్దంతో తుడిచేసుకున్నాను,
ఒక్క ఫిర్యాదుకూడా మిగల్లేదు.
పురుగు తనలో భ్రమరాన్ని పోల్చుకున్నట్టు
నువ్వు మనిషివని నీకు తెలిసివచ్చేదిప్పుడే.

సంధ్యాపుష్పమకరందం తేమగా తగలగానే
ఇదేకదా, ఒక మత్తషట్పదిగా,
ఇక్కడ కూరుకుపోవటమొక్కటే
కర్తవ్యమని స్ఫురించింది.

జీవికకోసం ఎక్కడ సంచారం చేసినా
పక్షులు గూటికి చేరుకున్నట్టు
ఇప్పటికి నేను నా పద్యాన్ని చేరుకున్నాను.

24-3-2018

# వివరణలు

1. **గుడిహత్నూరు, ధనోర, ఇంద్రవెల్లి**: అదిలాబాదునుంచి ఉత్నూరు వెళ్లే దారిలో ఎదురయ్యే గిరిజన గ్రామాలు. నేను 92-94 మధ్యకాలంలో ఉత్నూరులో పనిచేసాను.
2. **గెత్సమని**: యెరుషలేము లో ఒలీవల కొండ దగ్గర ఉన్న ఒక తోట. తనని శిలువ వేయడానికి ముందురోజు రాత్రి యేసు అక్కడ ప్రార్థించాడు. తన శిష్యుల్ని ఆ ఒక్కరాత్రి తనకోసం మేలుకొమ్మనీ, ప్రార్థించమనీ అడిగాడుగానీ, వాళ్లు ఆ రాత్రి ఆయనకోసం తమనిద్రని ఆపుకోలేకపోయారు.
3. **పడవలో నీళ్లు** : కబీరు దోహా. 'పానీ బాఢే నావ్ మేఁ ఘర్ బాఢే దామ్/దోనోఁ హాథ్ ఉలీచియే యహీ సయానా కామ్'
4. **తిరుప్పావై** : పంద్రెండు మంది ఆళ్వారుల్లో ఒకరిగా పరిగణింపబడుతున్న ఆండాళ్ రాసిన 30 పాశురాల గీతమాలిక. తమిళదేశంలో ధనుర్మాసంలో నెలరోజులపాటు రోజుకొక కీర్తనచొప్పున ఆలపిస్తారు.
5. **గుమ్మలక్ష్మీపురం**: విజయనగరం జిల్లా గిరిజన ప్రాంతాల్లో ఒక ముఖ్యగ్రామం. 1969-71 మధ్యకాలంలో ఇక్కడ గిరిజనులు పీడననీ, దోపిడీనీ తట్టుకోలేక తిరుగుబాటు చేసారు.
6. **కాకరపాడు** : విశాఖపట్టణం జిల్లా కొయ్యూరుమండలంలో ఒక గిరిజన గ్రామం. మా ఊరికి సరిహద్దు గ్రామం. ఆక్కడ ప్రతి ఆదివారం జరిగే సంతకి మా నాన్నగారు గిరిజనుల్ని కలవడానికి వెళ్తుండేవారు. మా చిన్నతనంలో మమ్మల్ని కూడా తీసుకువెళ్లేవారు.
7. **నీకన్నా నెలరోజులముందు** : టాగోర్ మే నెలలో పుట్టాడు. నేను మార్చినెలలో.
8. **గిరిజన కార్పొరేషను డిపో** : గిరిజనగ్రామాల్లో గిరిజనులకి నిత్యావసర వస్తువులు చౌకధరకి అందించడంకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిపోలు. మా ఊళ్లో కూడా ఆ డిపో ఒకటి ఉండేది. మాకు కావలసిన గుడ్డలు కూడా మా నాన్నగారు అక్కడే తీసుకునేవారు.
9. **అన్నా అక్మతోవాని అడిగినట్టు** : అన్నా అక్మతోవా (1889-1966) ప్రసిద్ధ రష్యన్ కవయిత్రి. సిల్వర్ యుగానికి చెందిన అగ్రశ్రేణి కవుల్లో ఒకరిగా పరిగణింపబడుతున్నది. స్టాలిన్ కాలంలో ఆమె కుమారుణ్ణి అరెస్టు చేసి నిర్బంధించారు.ఆమె తన కుమారుణ్ణి కలుసుకోవడం కోసం జైలుముందు సుదీర్ఘమైన క్యూలో నించున్నప్పుడు, ఒకామె ఆమెను గుర్తుపట్టి, 'ఈ అనుభవాన్ని కవితగా రాయగలవా?'అని అడిగిందట.
10. **ఒక హైకూ కవిలాగా**: సుప్రసిద్ధ జపనీస్ హైకూ కవి మత్సువొ బషో (1644-1694) తనని చూడవచ్చే మనుషుల్తో విసిగిపోయి తన కుటీరానికి గొళ్ళెం పెట్టేసానని రాసుకున్నాడు.
11. **ప్రాచీన గ్రీకు పానపాత్ర**: సుప్రసిద్ధ ఇంగ్లీషు రొమాంటిక్ కవి జాన్ కీట్స్ (1795-1821) రాసిన 'ఓడ్ టు ద గ్రీషియన్ అర్న్' (1819) ని స్మరిస్తూ. జర్మన్,ఇంగ్లీషు రొమాంటిసిస్టు సంప్రదాయం ప్రాచీన గ్రీకు కళని అమితంగా ఆరాధించింది. ఆ కళ శాశ్వతమైన జీవితాదర్శాలని ప్రతిబింబించిందని నమ్మింది. ఆ నమ్మకంలో భాగంగానే కీట్సుకూడా ఆ ప్రాచీన గ్రీకు పానపాత్రను ప్రస్తుతిస్తూ పద్యం రాసాడు.
12. **ఇన్నిస్ ఫ్రీ సరోవరం**: ఇన్నిస్ ఫ్రీ సరోవరం ఇర్లాండ్ లో ఉంది. తన పసితనంలో సుప్రసిద్ధ ఐరిష్ కవి డబ్ల్యు.బి.యేట్సు (1865-1939) అక్కడ గడిపేడు. ఆ జ్ఞాపకాలతోనూ, స్ఫూర్తితోనూ ఆ సరోవరం మీద ఒక కవితరాసాడు. ప్రాచీన సెల్టిక్ సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని ఆ కవిత కోరుకుంటున్నదని విమర్శకులు భావించారు.
13. **ఇషికవ తకుబొకు**: ఇషికవ తకుబొకు (1886-1912) ఆధునిక జపాన్ తంకా కవుల్లో ఎన్నదగ్గవాడు. 'కవిత్వం నిజాయితీగా రాసుకునే డైరీలాగా ఉండాల'న్నాడు.
14. **గుప్పెడు ఇసుక**: తకుబొకు కవితాసంపుటి 'ఇచియాకు నొ సున' అంటే అర్థం గుప్పెడు ఇసుక అని.
15. **తంకా :** సాంప్రదాయిక జపనీస్ ఛందస్సు. 5-7-5-7-7 మాత్రల్తో అయిదు పాదాల్తో నడిచే కవితా

రూపం. తంకాని వకా అని కూడా పిలుస్తారు. అందులో మొదటి మూడు పాదాలూ తర్వాతిరోజుల్లో హైకూ ఛందస్సుగా ప్రసిద్ధి పొందింది.

16. **చీనా చిత్రలేఖనం :** వాంగ్ జియా నాన్ అనే చైనా చిత్రకారుడు చిత్రించిన చిత్రాన్ని తలుచుకుంటూ.
17. **ఏడొంపుల ఘాటి :** కాకరపాడునుంచి కృష్ణదేవిపేట వెళ్ళే దారిలో వచ్చే ఒక చిన్న ఘాట్ రోడ్డు. ఏడు హెయిర్ పిన్ బెండ్లు ఉన్నందువల్ల దాన్ని ఏడొంపుల ఘాటి అని పిలుస్తారు. కృష్ణదేవి పేటలో మా అమ్మ పుట్టినిల్లు ఉన్నందువల్ల, మా చిన్నతనంలో మా అమ్మ వెంబడి ఆ ఘాటిమీంచి చేసిన ప్రయాణం ఒక అపురూపమైన జ్ఞాపకం.
18. **బోయపాడు :** మా ఊరునుంచి కాకరపాడు వెళ్ళేదారిలో మలుపు తిరిగితే బోయపాడు గ్రామం వస్తుంది. ఆ చిన్న గిరిజన గ్రామం మా నాన్నగారి పాలనాపరిధిలో ఉండేది. అక్కడే ఆయన కాకురు చిన్నబ్బాయి అనే గిరిజనవృద్ధుణ్ణి నా చిన్నప్పుడు నాకు పరిచయం చేసారు. అతడి ఇంటిముంగిట్లో నేను మొదటిసారి చూసిన జాఫరా చెట్టుమీద 'పునర్యానం' లో ఒక కవిత రాసేను.
19. **మిళింద పన్హ :** క్రీస్తుశకం 1-2 శతాబ్దాల మధ్యకాలంలో బాక్ట్రియాను పరిపాలించిన మినాండర్ అనే ఒక ఇండో గ్రీకు రాజుకీ, నాగసేనుడనే బౌద్ధ భిక్షువుకీ మధ్య జరిగిన సంభాషణ. సుత్తపిటకంలో ఖుద్దక నికాయంలో భాగంగా ఉన్న ఈ బౌద్ధ గ్రంథం చైనా, బర్మీస్, సింహళ బౌద్ధాల్లో ప్రాశస్త్యాన్ని సంపాదించుకుంది. ప్రాచీన భారతీయ సాహిత్యంలో గొప్ప వచనానికి ఈ గ్రంథాన్ని ఉదాహరణగా చెప్పవచ్చునని రైస్ డేవిస్ ప్రస్తుతించాడు.
20. **చాంగాన్:** చైనా చరిత్రలో దాదాపు పది రాజవంశాలకు రాజధాని. చైనా కవిత్వచరిత్రలో స్వర్ణయుగంగా పేర్కోనదగ్గ తాంగ్ రాజవంశకాలంలో ఇక్కడ ఎందరో అగ్రశ్రేణి కవులు కవిత్వం చెప్పారు. చాంగాన్ అంటే చైనీస్ భాషలో 'నిరంతరశాంతి' అని అర్థం.
21. **కొండ మీద అతిథి :** ప్రాచీన చీనామహాకవుల్లో ఒకడైన వాంగ్-వీ (701-761) రాసిన సుప్రసిద్ధ కవిత 'ఎర్రటి మంకెన పూత మీదరాత్రికురిసిన వాన/ వసంతవనాలలేతాకుపచ్చమీద తొలగని పొగమంచు/ రాలిన పూలనింకా ఎవరూ తుడిచిపెట్టలేదు/పక్షుల కిలకిల, కొండమీద అతిథి ఇంకా నిద్రలేవలేదు' ని తలుచుకుంటూ.
22. **బలలైకా:** రష్యన్ తంత్రీ వాద్యం.
23. **తపసిమాకులు:** గమ్ కరయా అనే బంకనిచ్చే చెట్లు. వీటిని కోవెల చెట్లనికూడా పిలుస్తారు. శాస్త్రీయ నామం స్టెర్క్యూలియా ఉరెన్స్.
24. **నామదేవుడూ, మొగల్ సిపాయీ:** ప్రసిద్ధ మహారాష్ట్రీ సంత్ కవి నామదేవ్ (1270-1350) అభంగం 'కుజా ఆమద్ కుజా రఫతీ కుజా మే రవీ' లో వర్ణించిన వృత్తాంతం.
25. **బషోకి ఫ్యూజియామ:** సుప్రసిద్ధ జపనీస్ హైకూ కవి బషో కుటీరం నుంచి ఎదురుగా ఫూజియామా అగ్నిపర్వతం కనిపిస్తుండేది. అతడి హైకూలు చాలావరకు ఫూజియామా చుట్టూ అల్లినవే.
26. **శ్రీకూర్మం:** శ్రీకాకుళం జిల్లాలోని కూర్మావతార వైష్ణవపుణ్యక్షేత్రం.
27. **సుషమా సుధాగాన మంజువాటి:** కృష్ణశాస్త్రి 'ప్రవాసము' కావ్యంలోని ప్రసిద్ధ పద్యం. 'నా నివాసమ్ము తొలుత గంధర్వలోక మధుర సుషమాసుధాగాన మంజువాటి/ ఏనొక వియోగ గీతిక, నేను నిదురవెన్నెలదారినొక రేయి వెదలిపోతి ఒక విపంచీ విరహకంఠమొరసి ఎగసి.'
28. **గుచ్చుకుంటున్న దృశ్యం:** మిర్చి పంటకి గిట్టుబాటు ధర రావటంలేదని ఆందోళన చేసిన పదిమంది రైతుల్ని తెలంగాణా ప్రభుత్వం 11-5-2017 న అరెస్టు చేసి సంకెళ్ళు తగిలించి తీసుకువెళ్తున్న దృశ్యం.
29. **కబీరు ఒక రోజు కాశీలో:** కబీరు కవిత, ఆదిగ్రంథం, రాగ కేదారా, 5.
30. మల్లికార్జున మాన్సుర్ : జైపూర్-అత్రౌలి ఘరానాకు చెందిన హిందుస్తానీ సంగీతవిద్వాంసుడు మల్లికార్జున మాన్సుర్ (1911-92) సుప్రసిద్ధ ఖయాల్ గాయకుడు.

## జీవితవివరాలు, రచనలు

పుట్టింది 1962 మార్చి 28 న తూర్పుగోదావరిజిల్లా శరభవరం గ్రామంలో. తల్లిదండ్రులు విశ్వేశ్వరవెంకట చలపతి, సత్యవతీదేవి. 1982 నుండి 1987 దాకా రాజమండ్రిలో టెలికమ్యూనికేషన్స్ డిపార్టుమెంటులో పనిచేసిన తర్వాత, 1987 నుంచి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖలో ఉద్యోగం. విజయనగరం, విశాఖపట్టణం, కర్నూలు, అదిలాబాదు జిల్లాల్లో జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా, శ్రీశైలంలో చెంచువారికోసం ఏర్పాటు చేసిన సమగ్రగిరిజనాభివృద్ధి సంస్థకు ప్రాజెక్టు అధికారిగా, 2000 నుండి 2016 దాకా గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోనూ దాదాపు ముప్పై ఏళ్లపాటు పనిచేసాక ప్రస్తుతం డెప్యుటేషను మీద హైదరాబాదులో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నడుస్తున్న సెంటర్ ఫర్ ఇన్నొవేషన్స్ ఇన్ పబ్లిక్ సిస్టమ్స్‌లో సలహాదారుగా ఉద్యోగబాధ్యతలు. ఆంధ్ర విశ్వవిద్యాలయంనుండి తత్త్వశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టాతో పాటు మాంచెస్టరు విశ్వవిద్యాలయం నుండి దారిద్ర్యనిర్మూలన పథకాలమీద శిక్షణ. ఇంతదాకా వెలువరించిన పుస్తకాలు మొత్తం 34 గ్రంథాలు. వాటి వివరాలు:

### కవిత్వం

**నిర్వికల్పసంగీతం*** (1986). ఈ రచనకు 1988 లో నూతలపాటి గంగాధరం స్మారకపురస్కారం లభించింది.

**ఒంటరి చేల మధ్య ఒక్కత్తే మన అమ్మ*** (1995)

**పునర్యానం*** (ఎమెస్కో, 2004). ఈ దీర్ఘకావ్యానికి 2008 లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ వచనకవితా పురస్కారం లభించింది.

**కోకిల ప్రవేశించే కాలం*** (శ్రీ ప్రచురణ,2009). ఈ కావ్యానికి 2010 లో ఇస్మాయిల్ పురస్కారం లభించింది.

**నీటిరంగుల చిత్రం** (శ్రీ ప్రచురణ, 2014)

### సాహిత్యవిశ్లేషణ

**సహృదయునికి ప్రేమలేఖ*** (ఎమెస్కో, 2001). ఈ సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం లభించింది.

**సాహిత్యమంటే ఏమిటి*** (శ్రీ ప్రచురణ, 2009)

**సాహిత్యసంస్కారం** (ఎమెస్కో, 2017)

**కథాసంపుటి**

**ప్రశ్నభూమి*** (1990)

**నవల**

**అరణ్యం*** ఆంధ్రజ్యోతి దినపత్రికలో ధారావాహిక (నవోదయ, 1987)

**సామాజిక విశ్లేషణ**

**సోమయ్యకు నచ్చిన వ్యాసాలు*** (శ్రీ ప్రచురణ, 2012)

**యాత్రానుభవాలు**

**నేను తిరిగిన దారులు*** (శ్రీ ప్రచురణ, 2011)

**విద్య**

**కొన్ని కలలు, కొన్ని మెలకువలు*** (ఎమెస్కో, 2005)

**బాలసాహిత్యం**

**మీరు ఇంటినుంచి ఏమి నేర్చుకోవాలి*** (ఎమెస్కో, 2005)

**మీరు బడినుంచి ఏమి నేర్చుకోవాలి*** (ఎమెస్కో, 2005)

**మీరు సమాజం నుంచి ఏమి నేర్చుకోవాలి*** (ఎమెస్కో, 2005)

**ఆధ్యాత్మికం**

**పరమయోగి శ్రీ వై. హనుమంతరావు*** (2006)

**సంకలనాలు**

**వందేళ్ళ తెలుగు కథ**, ఇరవయ్యవశతాబ్ది తెలుగు ప్రతినిధి కథల సంకలనం (ఎమెస్కో, 2001)

**మనసున మనసై***, భారతీయ కవులూ, వారి హృదయేశ్వరులూ,ఎంపిక చేసిన కవితలూ,పరిచయాలూ. (ఎమెస్కో, 2014)

## సంకలనాలు, అనువాదాలు

**హైకూ యాత్ర**, మత్సువొ బషొ యాత్రానుభవాలు (ఎమెస్కో, 2010)

**నాది దుఃఖం లేని దేశం**, కబీరు కవిత్వం (శ్రీ ప్రచురణ, 2017)

**సత్యాన్వేషణ**, 2500 ఏళ్ళ పాశ్చాత్య తత్త్వశాస్త్రం నుండి ఎంపిక చేసిన రచనలు (ఎమెస్కో, 2003)

**ఇమ్మాన్యువల్ కాంట్ రచనలు** (పీకాక్ క్లాసిక్స్, 2008)

**ప్రత్యూష పవనాలు*** (ఎమెస్కో, 1996)

## అనువాదాలు

### డా. ఎ.పి.జె.అబ్దుల్ కలాం రచనలు

**ఒక విజేత ఆత్మకథ** (ఎమెస్కో, 2002)('వింగ్స్ ఆఫ్ ఫైర్')

**నా దేశ యువజనులారా** (ఎమెస్కో, 2002) ('ఇగ్నైటెడ్ మైండ్స్'). ఈ రచనకు కేంద్ర సాహిత్య అకాడెమీ నుండి ఉత్తమ అనువాద పురస్కారం లభించింది.

**ఈ మొగ్గలు వికసిస్తాయి** (రీమ్ పబ్లికేషన్స్, 2009)('యు ఆర్ బార్న్ టు బ్లోసమ్')

**ఎవరికీ తలవంచకు** (రీమ్ పబ్లికేషన్స్, 2009), ('ఇండామిటబిల్ స్పిరిట్' )

**ఉత్తమ కుటుంబం, ఉదాత్త దేశం** (రీమ్ పబ్లికేషన్స్, 2015), ఆచార్య మహాప్రజ్ఞ తో కలిసి చేసిన రచన ('ద ఫామిలీ అండ్ ద నేషన్')

## గాంధేయసాహిత్యం

**గాంధీ వెళ్ళిపోయాడు, మనకు దిక్కెవరు** (ఎమెస్కో, 2010), డా.గోపాలకృష్ణ గాంధీ, 'గాంధి ఈజ్ గాన్, హు విల్ గైడ్ అస్')

**సత్యమొక్కటే, దర్శనాలు వేరు**, గాంధీ టాగోర్ లేఖలు (ఎమెస్కో, 2016)

**మహాత్ముడి పెద్దకొడుకు: హరిలాల్ గాంధి జీవితం**, చందుభాయి భాగుభాయి దలాల్ గుజరాతీ రచనకు తృదీప్ సుహృద్ ఇంగ్లీషు అనువాదం (ఎమెస్కో, 2016)

### వేదాంతం

**వేదార్థ మీమాంస** (ఎమెస్కో, 2011), ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి రచన 'వేదిక్ హెర్మన్యూటిక్స్'.

### మానేజిమెంటు

**వారిలా కలగనండి, వారిలా సాధించండి**, (రీమ్ పబ్లికేషన్స్, 2010) రశ్మి బన్సల్ రచన 'స్టే హంగ్రీ, స్టే ఫూలిష్

** ప్రస్తుతం ఈ పుస్తకాల ప్రతులు అలభ్యం.*



నిర్వికల్ప సంగీతం (1986), ఒంటరిచేలమధ్య ఒక్కత్తే మన అమ్మ (1995), పునర్యానం (2004), కోకిల ప్రవేశించే కాలం (2009), నీటిరంగుల చిత్రం (2014) తరువాత వాడ్రేవు చినవీరభద్రుడు వెలువరిస్తున్న కవితా సంపుటి ఈ 'కొండ మీద అతిథి, మరికొన్ని కవితలు'.

2014 నుంచి గత నాలుగేళ్లుగా రాస్తూ వచ్చిన ఈ కవితల్నిట్లా ఏరికూర్చుతూ కవి పూర్వకాలపు చైనా సామెతని ఒకదాన్ని తలచుకుంటున్నాడు. 'చిన్నపాటి పరివ్రాజకుడు కొండల్లో తిరుగుతాడు, సర్వ సంగపరిత్యాగి నగరంలో జీవిస్తాడు' అని. గత ఇరవయ్యేళ్ళుగా  నగరంలో నివసిస్తూ ప్రాపంచిక పరాజయాన్ని అభ్యసించడమెట్లానో, పూర్తిపరివ్రాజకుడుగా జీవించడమెట్లానో సాధన చేస్తూనే ఉన్నానని చెప్పుకుంటున్నాడు.

పరిత్యాగమంటే ప్రపంచాన్ని వదిలెయ్యడం కాదు, ప్రపంచంలో ఉంటూనే ప్రపంచానికి అంటిపెట్టుకుపోకుండా ఉండటమనే గుర్తుచేసుకుంటూ తనలోని అన్ని రకాల ఆధిపత్యవాసనల్ని నిర్మూలించుకునే క్రమంలోనే ఈ కవిత్వం రాస్తున్నాడని వివరిస్తున్నాడు. ఆ మెలకువతో ఈ సంపుటిని తన కవిత్వాన్ని ఇష్టపడే వారందరికీ కానుక చేస్తున్నాడు.